
సర్వమతాల సారాంశం ఒక్కటే..



దేవతల వేషధారణలో చిన్నారులు

పుట్టపర్తి, న్యూస్‌టుడే : సర్వమతాల సారాంశం ఒక్కటేననే సందేశాన్ని కర్ణాటక రాష్ట్ర బాలవికాస్ చిన్నారులు నృత్యరూపకం ద్వారా తెలియజేశారు. పర్తియాత్ర పేరిట పుట్టపర్తికి వచ్చిన ఆ చిన్నారులు శనివారం సాయికుల్వంత్ మందిరంలో 'ప్రేమ నృత్యాంజలి' నృత్యరూపకం ప్రదర్శించారు. సత్యసాయి అవతార ఘట్టాలు, సర్వమతాలకు నిలయంగా ప్రశాంతి నిలయం విశ్వవ్యాప్తంగా ప్రసిద్ధికెక్కిందని వారు తెలియజేశారు. సత్యసాయి భక్తిగీతాలను శ్రావ్యంగా ఆలపించారు. ఉదయం ప్రముఖ సంగీత గాయకుడు రాజేశ్ బందార్కర్ బృందం అద్భుతంగా సంగీత కచేరి నిర్వహించింది. బాలవికాస్ చిన్నారులకు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, సతీమణి హిమవాహిని వస్త్రాలను అందజేసి అభినందించారు. భక్తులు బారులు తీరి మహాసమాధిని దర్శించుకున్నారు. కర్ణాటక రాష్ట్ర భక్తుల పర్తియాత్ర నేటితో ముగిసింది.



గిరిజనుల సంప్రదాయ నృత్యం

బిందు, సూక్ష్మ సేద్యానికి పూర్వవైభవం

పుట్టపర్తి, న్యూస్‌టుడే : జిల్లాలో బిందు, సూక్ష్మ సేద్యాన్ని ప్రోత్సహించేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బిందు పరికరాలు 90, 70, సూక్ష్మ పరికరాలు 45, 55 శాతం రాయితీతో అందించనుంది. రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 2014-19 మధ్య కాలంలో బిందు, సూక్ష్మ సేద్యానికి పెద్దపీట వేసి ప్రోత్సహించారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఆ పథకాన్ని గాలికివదిలేసింది. రాయితీ బకాయిలు చెల్లించకపోవడంతో సంబంధిత కంపెనీలు పరికరాలు అందించేందుకు ఆసక్తి చూపలేదు. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం శ్రీసత్యసాయి జిల్లాలో బిందు, సూక్ష్మ పరికరాలను 30,230 వేల ఎకరాలకు అందించడమే లక్ష్యం నిర్దేశించుకుంది. ఇప్పటి వరకు 650 ఎకరాలకు ఆయా పరికరాలు అందించేందుకు అధికారులు సిద్ధం చేశారు. రైతులు ఆన్‌లైన్ కలిగిన పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలతో రైతు సేవా కేంద్రాలకు వెళ్లి, వీఏఏ, వీహెచ్‌ఏ, వీఎస్‌ఏను సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు. అక్కడ బయోమెట్రిక్ ద్వారా తమ పేర్లు నమోదు చేసుకుంటారు. ప్రస్తుతం సంబంధిత అధికారులు సచివాలయాల ద్వారా వివరాల నమోదు చేస్తున్నారు. పరికరాల సరఫరాకు 30 కంపెనీలను ఎంపిక చేశారు. ఐదెకరాలలోపు ఉన్న రైతులకు 90, 70 శాతం రాయితీతో సూక్ష్మ సేద్యం పరికరాలు అందిస్తారు. అదే విధంగా ఐదెకరాలలోపు రైతులకు 55 శాతం, అంత కంటే ఎక్కువ విస్తీర్ణం కలిగిన రైతులకు 45 శాతం రాయితీతో తుంపర సేద్య పరికరాలు ఇస్తారు.



రైతుల వివరాలు తెలుసుకుంటున్న సిబ్బంది

కార్యాలయాల్లో సంప్రదించండి..

- సుదర్శన్, పీడీ, ఏపీఎంఐపీ, శ్రీసత్యసాయి జిల్లా

బిందు, సూక్ష్మ పరికరాలు రాయితీతో అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటి వరకు 650 ఎకరాలకు దరఖాస్తులు వచ్చాయి. పూర్తి వివరాలకు ఏపీఎంఐపీ పీడీ కార్యాలయంలో, ప్రాంతీయ కార్యాలయాల్లోనూ సంప్రదించాలి.

వ్యర్థంలో అర్థం వెతికిన ఆర్డీటీ!



కందకం విధానంలో ఎరువుల తయారీ

- చెత్త నిర్వహణలో 'మన భూమి' భేష్
- ఎరువులు తయారు చేసి మొక్కలకు వినియోగం

స్ఫూర్తిగా తీసుకుంటే మేలు

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే

చిన్న మార్పు పెద్ద ప్రభావాన్ని చూపుతాయన్న సూక్తిని పాటిస్తోంది ఆర్డీటీ. మనం ఒకరికి నీతులు చెప్పడం కాదు.. మన నుంచే మంచి ప్రారంభం కావాలన్న లక్ష్యంతో మన భూమి అనే పథకానికి ఆర్డీటీ మూడేళ్ల క్రితమే శ్రీకారం చుట్టింది. అనంత నగరంలోని ఆర్డీటీ ప్రధాన కార్యాలయం, టీవీ టవర్ సమీపంలోని మరో కార్యాలయం, క్రీడాగ్రామం, దివ్యాంగుల పాఠశాల, బత్తలపల్లి, కళ్యాణదుర్గం, కణేకల్లు, కూడేరు ఆసుపత్రులు, బుక్కరాయసముద్రం పాఠశాలల్లో చెత్త నిర్వహణ తీరు ఆదర్శంగా ఉంది. మూడు విధానాల్లో వ్యర్థాల నుంచి ఎరువులను ఉత్పత్తి చేస్తున్నారు. కందకాలు, ఆర్బిన్, మెష్ విధానాలు అమలు చేస్తున్నారు. తడి వ్యర్థాలు సేకరించడానికి ప్రత్యేకంగా డబ్బాలు ఏర్పాటు చేశారు. ఒకసారి వినియోగించి పారేసే ప్లాస్టిక్‌ను ఆర్డీటీ ప్రాంగణాల్లో నిషేధించారు. ప్లాస్టిక్ నీళ్ల సీసాలు, సంచులు, చెంచాలు, ఇతర ప్లాస్టిక్ వస్తువులను వేరువేరుగా పోగు చేసి ఒక గదిలో భద్రపరుస్తారు. గది నిండిన తర్వాత గుజిరి వ్యాపారులకు విక్రయిస్తారు. చెత్త సేకరణ బట్టి మూడు లేదంటే నాలుగు నెలలకు ఒకసారి కుళ్లిన ఎరువును బయటికి తీసి మొక్కలకు ఉపయోగిస్తున్నారు.



ఆర్బిన్ విధానంలో ఎరువు ఉత్పత్తి

చెత్త సమస్యతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రహదారులు, కాలువలు... ఇలా ఎక్కడ చూసినా పండ్ల తొక్కలు, కుళ్లిన కూరగాయలు, ఆకుకూరలు, తిను బండారాలు పారబోస్తున్నారు. ప్రధానంగా హోటళ్లు, కల్యాణ మండపాలు, ఆసుపత్రులు, కూరగాయల మార్కెట్లు, వసతిగృహాల నుంచి టన్నుల కొద్దీ పడేస్తున్నారు. అనంతపురం నగరంలో దాదాపు అన్ని రకాల కల్యాణ మండపాలు సుమారు 250.. ప్రభుత్వ, ప్రైవేటు వసతిగృహాలు 70 వరకు ఉన్నాయి. రోజూ నగరంలో 10 టన్నుల నుంచి 15 టన్నుల వరకు తడిచెత్త పోగవుతోందని అంచనా. దీన్ని తరలించడానికి నగర పాలక సంస్థకు భారంగా మారుతోంది. ఆర్బిన్, కందక, కంపోస్ట్ విధానంలో ఎరువు ఉత్పత్తి చేస్తే ఆదాయం వస్తుంది. టన్ను ఎరువు నాణ్యత బట్టి వేల రూపాయల ధర పలుకుతోంది. చెత్తతో సంపదను సృష్టించడంతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలంటే ఆర్డీటీ 'మన భూమి'ని స్ఫూర్తిగా తీసుకోవడం ఉత్తమం.

'మన భూమి'కి సేకరణ.. తయారీ ఎలాగంటే..

- ఆర్డీటీ కార్యాలయాలు, క్రీడా ప్రాంగణాలు, ఆసుపత్రుల్లో రోజూ సేకరిస్తున్న తడిచెత్త: 500 కిలోలు
- 3 నుంచి 4 నెలలకొకసారి ఉత్పత్తి చేస్తున్న ఎరువు: 5 టన్నులు
- రాలిన ఆకులు, కుళ్లిన పండ్లు, తొక్కలు, కూరగాయలు, ఆకుకూరలు, మిగిలిపోయిన ఆహార పదార్థాలు.. తదితర వ్యర్థాలను కందకాలు, మెష్, ఆర్బిన్ విధానాల్లో ఎరువు తయారు చేస్తున్నారు.
- ప్రతి ప్రాంగణంలో సిబ్బంది వంతుల వారీగా పని చేస్తున్నారు. ప్రత్యేకంగా నిర్వహణకు నలుగురిని నియమించారు. స్పెయిన్‌కు చెందిన అరాంచ అనే మహిళా ఉద్యోగిని నేతృత్వం వహిస్తున్నారు.

అందరూ పాటిస్తే మంచి ఫలితాలు

విశాలఫెర్రర్, ఆర్డీటీ డైరెక్టర్



వ్యర్థాలనూ సక్రమంగా ఉపయోగించాలన్నదే ఆర్డీటీ అభిమతం. అందుకే మన భూమి అనే పథకం పేరిట వ్యర్థాలతో ఎరువులు తయారు చేస్తున్నాం. ఆర్డీటీ వివిధ కార్యాలయాల్లోని మొక్కలకు ఎరువులు వేయడం వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయి. అందరినీ ప్రోత్సహిస్తున్నాం. సిబ్బందికి తగిన శిక్షణ ఇచ్చాం. భవిష్యత్తులో వంటకు అవసరమైన కూరగాయలు, ఆకుకూరలు పండించాలని ఆలోచిస్తున్నాం.

నల్లచెరువులో అత్యధిక వర్షం.. అమడగూరులో అత్యల్పం

పుట్టపర్తి, న్యూస్‌టుడే : శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం రాత్రి 28 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా నల్లచెరువు 58.4, అమడగూరు 1.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. తాడిమర్రిలో 48.4, సీకేపల్లిలో 45.6, బత్తలపల్లి 42.4, ఎన్‌పీకుంట 42.2, ధర్మవరం 38.4, గోరంట్ల 38.2, రామగిరి 29.8, అగళి 28.6, ముదిగుబ్బ 19.4, రొళ్ల 17.4, పెనుకొండ 15.4, బుక్కపట్నం 15.0, కనగానపల్లి 10.2, మడకశిర 10.0, గాండ్లపెంట 9.4, కొత్తచెరువు 8.6, నల్లమాడ 8.2, పుట్టపర్తి 6.8, చిలమత్తూరు 6.2, గుడిబండ 4.2, ఓడీసీ 4.2, సోమందేపల్లి 4.2, కదిరి 4.0, తలుపుల 3.8, అమరాపురం 1.6, తనకల్లు 1.6 మి.మీ.ల వర్షపాతం నమోదైనట్లు జిల్లా ప్రణాళికాధికారి విజయ్‌కుమార్ తెలిపారు. గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటల్లోకి వర్షపునీరు చేరడంతో జలాలతో కళకళలాడుతున్నాయి. వర్షాలకు దెబ్బతిన్న వ్యవసాయ, ఉద్యాన పంటలతో పాటు, ఇళ్లు, గుడిసెలను నష్టాన్ని అధికారులు అంచనాలు రూపొందించి, ప్రభుత్వానికి నివేదిక అందించేందుకు సిద్ధం చేస్తున్నారు.

21 నుంచి పోలీసు అమరవీరుల వారోత్సవాలు

పుట్టపర్తి, న్యూస్‌టుడే : జిల్లాలో ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు పోలీసు అమరవీరుల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ రత్న పేర్కొన్నారు. ఏటా పోలీసు అమరులను స్మరించుకుంటూ నిర్వహించే ఈ వారోత్సవాలను జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు.



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్, జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ వినోద్‌కుమార్, అధికారులు



పింఛన్ల తొలగింపు విషయంలో మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజుతో వైకాపా జడ్పీటీసీ సభ్యుల వాగ్వాదం. చిత్రంలో ఎమ్మెల్యే పల్లె సింధూర

నిబద్ధతతోనే ప్రజా సమస్యల పరిష్కారం

జడ్పీ సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: మండల, గ్రామ స్థాయిలో ఎంపికైన ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో కృషి చేయాలని మంత్రి సత్యకుమార్ పిలుపునిచ్చారు. రాజకీయ విభేదాలు పక్కనబెట్టి ప్రజల సమస్యల పరిష్కారానికి అన్ని పార్టీల నాయకులు కలిసి పనిచేయాలని సూచించారు. శనివారం జడ్పీ సర్వసభ్య సమావేశానికి హాజరై ప్రసంగించారు. జడ్పీ ఛైర్‌పర్సన్ బి.గిరిజమ్మ అధ్యక్షత వహించగా కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, పల్లె సింధూర, శ్రీసత్యసాయి జిల్లా డీఆర్వో కొండయ్య, ఇన్‌ఛార్జి సీఈఓ కొండయ్య, పలు మండలాల జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు పాల్గొన్నారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో చెరువులకు నీరు విడుదల సమయంలో అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వృథాను అరికట్టి పంటలకు ఎక్కువగా విడుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రం అమలు చేస్తున్న గ్రామీణ సడక్ యోజన కింద మూడో విడతలో మంజూరైన రహదారుల పనులకు ప్రతిపాదనలు వెంటనే పంపాలన్నారు.

★ రాష్ట్రవ్యాప్తంగా 15 లక్షల కొత్త పింఛన్లు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధమైందని అర్హులైన వారిని ఎంపిక చేయడానికి అధికారులు అన్ని నిబంధనలు పాటించాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కోరారు. ప్రతి జడ్పీ సమావేశానికి శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్లు, ఇతర శాఖల అధికారులు తప్పకుండా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మడకశిర బ్రాంచి కెనాల్‌కు నీరు వదలాలని కోరారు.

★ ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు అరకొరగా సరఫరా చేస్తున్నట్లు పలువురు జడ్పీటీసీ సభ్యులు వాపోయారు. ఖరీఫ్‌లో సరైన వర్షాలు లేకపోవడంతో ప్రత్యామ్నాయ పంటలు సాగుకు రైతులు సిద్ధమయ్యారని రైతు భరోసా కేంద్రాలకు ఎరువులు విత్తనాలు రాలేదన్నారు. ప్రత్యామ్నాయ పంటల విత్తనాలకు సంబంధించి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు.

★ హంద్రీనీవా ద్వారా అన్ని చెరువులు నింపాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి కోరారు. అవసరమైన మరమ్మతులు చేసి వృథా అరికట్టాలని కోరారు.

పింఛన్లు తొలగిస్తున్నారంటూ దుమారం

వృద్ధాప్య, దివ్యాంగులు, వితంతు పింఛన్ల తొలగింపుపై జడ్పీ ఉప ఛైర్‌పర్సన్ నాగరత్న, అనంతపురం జడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్ మండిపడ్డారు. రాజకీయ కారణాలతో అర్హులను జాబితా నుంచి తొలగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. దివ్యాంగుల పింఛనుకు సంబంధించి తాఖీదు ఇచ్చిన వెంటనే తొలగించినట్లు అర్థం చేసుకుంటున్నారని అది సరికాదని వివరించారు.

నాణ్యత డొల్ల.. తింటే గుల్ల!

- ఆహార పదార్థాలు కల్తీ
- ఆకర్షణ కోసం రంగుల వినియోగం
- కేసులు నమోదు చేస్తున్నా మారని తీరు

ఈనాడు అనంతపురం

పలు ఆహార పదార్థాల్లో హానికర రంగులు, పలుమార్లు వాడిన నూనెతో వంటకాలు, మాంసం నిల్వ.. తదితరాలు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లలో వెలుగుచూస్తున్నాయి. కల్తీ ఆహారంతో వ్యాపారం చేస్తూ కొందరు జేబులు నింపుకొంటున్నారు. ఫలితంగా ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతోంది. ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కూరగాయలను కడగకుండానే వాడుతుండటంతో వాటిపై ఉన్న పురుగు మందుల అవశేషాలు ఆహార పదార్థాల్లో కలుస్తున్నాయి. ఇక బిర్యానీ, కబాబ్, గోబీ మంచూరియా, కొన్ని రకాల మిఠాయిల ఆకర్షణ కోసం సింథటిక్ రంగులు కలుపుతున్నారు. నూడుల్స్, ఫ్రైడ్‌రైస్‌లో టేస్టింగ్ సాల్ట్ వినియోగిస్తున్నారు. వాటి ప్రభావం జీర్ణక్రియ, నాడీ వ్యవస్థపై ప్రభావం పడుతుంది. మరోవైపు ఆహార పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో ప్యాకింగ్ చేస్తూ ప్రజారోగ్యాన్ని మరింత దెబ్బతీస్తున్నారు.



హానికర రంగులు కలిపి తయారుచేసిన చికెన్ కబాబ్

ఈ ఏడాది నమోదైన కేసులు ఇలా..	
సురక్షితం కాని ఆహారం	09
నాసిరకం	05
ఇతర కేసులు	03

అదే నూనె పదేపదే..

ఒకసారి వినియోగించిన నూనెను వంటకాల్లో వాడటం ఆరోగ్యానికి శ్రేయస్కరం కాదు. ప్రధానంగా కబాబ్, బజ్జీ, జిలేబీల తయారీలో నూనెలను అనేకసార్లు వాడుతున్నారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వద్ద టోటల్ పోలార్ కాంపొనెంట్స్ (టీపీసీ) పరికరాలు ఉంటాయి. తనిఖీకి వెళ్లినప్పుడు మరగబెడుతున్న నూనెలో పరికరాన్ని ముంచితే వినియోగానికి పనికొస్తుందా లేదా అనేది తెలిసిపోతుంది.

తనిఖీలకు సిబ్బంది కొరత

ఉమ్మడి అనంతపురం జిల్లా ఆహార భద్రతా విభాగంలో మొత్తం నలుగురు సిబ్బంది ఉన్నారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్‌తో పాటు ఆహార భద్రతా అధికారి ఒకరు ఉండగా మరో ఇన్‌ఛార్జి ఉన్నారు. అటెండర్లు ఇద్దరికి గాను ఒక్కరే ఉన్నారు. నిబంధనల మేరకు పట్టణాల్లో 50 వేల జనాభా, గ్రామీణ ప్రాంతాల్లో లక్ష జనాభాకు ఒక ఆహార భద్రతా అధికారి ఉండాలి. సిబ్బంది కొరతతో తనిఖీలు ఇబ్బందిగా మారాయి. దీనికితోడు ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు పొందిన ఎన్ఏబీఎల్ ల్యాబ్ లేకపోవడంతో నమూనాలను తెలంగాణలోని నాచారం పంపి పరీక్షలు చేయిస్తున్నారు. ఫలితాలు రావడానికి ఆలస్యమవుతుండటంతో వెంటనే చర్యలు తీసుకోలేకపోతున్నారు.



హోటల్‌లో తనిఖీ చేస్తున్న ఆహార భద్రత అధికారి

కొన్ని ఉదంతాలు ఇవిగో..

- అనంత నగరం కోర్టు రోడ్డులోని ఓ బిర్యానీ సెంటర్‌లో పరీక్షించగా.. హానికర సింథటిక్ రంగులు కలిపినట్లు తేలింది. సుభాష్ రోడ్డులోని ఓ రెస్టారెంట్, వడియంపేట సమీపంలో ఓ హోటల్, రుద్రంపేట సమీపాన ఓ రెస్టారెంట్‌లో ఆహార భద్రతా అధికారులు తనిఖీ చేయగా.. అన్నింటిలోనూ మోతాదుకు మించి రంగులు వినియోగించినట్లు నిర్ధారణ కావడంతో నిర్వాహకులపై కేసులు నమోదు చేసి విచారిస్తున్నారు.
- నగరంలోని ఓ జిలేబి విక్రయ కేంద్రంలో నమూనాలను ల్యాబ్‌కు పంపించి పరీక్షించగా.. సల్ఫర్ ఉన్నట్లు తేలింది. ఎక్కువసార్లు పాలిష్ చేసిన బెల్లం వాడటంతో సల్ఫర్ ఆనవాళ్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు.
- టవర్‌క్లాక్ సమీపాన ఓ హోటల్‌లోని గోబీ మంచూరియాలో హానికరమైన రంగులు కలిపినట్లు పరీక్షలో తేలింది.
- తపోవనం సర్కిల్ సమీపాన ఉన్న టీ దుకాణంలో టీ పొడిని పరీక్షించగా అందులో క్రిమిసంహారక మందుల ఆనవాళ్లు ఉన్నట్లు గుర్తించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- తస్లిమా, ఆహార భద్రత అధికారి, అనంతపురం

ఆహార పదార్థాల తయారీ, నిల్వ, విక్రయాల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు. కొంతమంది హానికర రంగులు కలుపుతున్నట్లు తనిఖీల్లో తేలింది. వారిపై కేసులు నమోదు చేశాం. కొన్ని కేసులు కోర్టుల్లో ఉన్నాయి. సిబ్బంది కొరత ఉన్నా ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి తగిన చర్యలు తీసుకుంటున్నాం.

రైల్వే రోడ్ బాధితుల ఆందోళన

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: నష్టపరిహారం ఇవ్వకపోయినా, విలువైన స్థలాలు కోల్పోతున్నా, పట్టణ అభివృద్ధికి సహకరించాలని భవనాలు తొలగించుకొంటున్నాం.. మున్సిపల్ అధికారులు గతంలో రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను తుంగలోతొక్కి రహదారిని 70కి బదులుగా 80 అడుగులు విస్తరించడానికి కూల్చివేతలకు దిగడం అన్యాయమని రైల్వే రోడ్డులో భవనాలు, స్థలలు కోల్పోతున్న బాధిత యజమానులు అధికారులపై మండిపడ్డారు. భవనాల కూల్చివేతలను అడ్డుకోవడానికి శనివారం సాయంకాలం ప్రయత్నించారు. పోలీసులు వారిని వారించి, అధికారులతో మాట్లాడుకోవాలని సూచించారు. బాధితులకు మద్దతుగా తెదేపా సీనియర్ నాయకుడు వెంకటస్వామి మాట్లాడారు. ఈ విషయం ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ రాజగోపాల్ నాయుడికి తెలియడంతో ఆయన వెంటనే రైల్వే రోడ్‌లోకి చేరుకొన్నారు. నాయకులతో చర్చలు జరిపారు. నష్టపరిహారం వెంటనే చెల్లించేలా మున్సిపాల్టీ వారితో మాట్లాడుతానని, రాత పూర్వకంగా కుదిరిన ఒప్పందాల ప్రకారమే రహదారి విస్తరణ జరిగేలా చూస్తామని, నిబంధనలకు విరుద్ధంగా మున్సిపల్ అధికారులు వ్యవహరిస్తే, బందోబస్తు ఏర్పాటు చేసేది లేదని వారికి హామీ ఇచ్చారు.

ఐదేళ్లూ చుక్కలు చూపించారు

- 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించినా లభించని పరిష్కారం
- రైతులకు వీడని చిక్కులు




ఎన్ఎస్‌పీ కొట్టాల పంచాయతీ పరిధిలో సాగులో చుక్కల భూములు

ముదిగుబ్బ, ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే : చుక్కల భూములపై పూర్తి హక్కులు రైతులకే చెందాలి. రెవెన్యూ కార్యాలయాలు, కోర్టుల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, పైసా ఖర్చు రాకుండా దశాబ్దాల కాలం నాటి సమస్యకు చరమగీతం పాడుతామంటూ గత వైకాపా ప్రభుత్వం గొప్పలు చెప్పింది. ఐదేళ్లలో నిషేధిత జాబితా నుంచి చుక్కల భూములను తొలగించడంలో మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించింది. గతేడాది 22ఎ నిషేధిత జాబితా నుంచి చుక్కల భూములను తొలగించాలని చట్టసవరణ తీసుకొచ్చింది. క్షేత్రస్థాయిలో అటు పాలకులు, ఇటు అధికారులు శ్రద్ధ తీసుకోకపోవడంతో రైతులు, భూయజమానులు అమ్ముకోలేక, బ్యాంకుల్లో రుణం పొందలేక నానా అవస్థలు పడుతున్నారు. రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదర్శన చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ధర్మవరం గ్రామీణం, బత్తలపల్లి, ముదిగుబ్బ, తాడిమర్రి మండలాల్లో చుక్కల భూములు 15 వేల ఎకరాలకు పైగా ఉన్నాయి.

గత తెదేపా ప్రభుత్వం ఆదేశించినా..

2017, జూన్ 13కు ముందు 12 ఏళ్ల అనుభవంలో ఉన్న రైతులకు సదరు భూమిపై శాశ్వత హక్కు కల్పించి. . వారి పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని గత తెదేపా ప్రభుత్వం ఆదేశించినా అమలుకు నోచుకోలేదు ఫలితంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చుక్కల కష్టాలు తీరుతాయని అన్నదాతలు ఆశలు పెట్టుకున్నారు.


అప్పులు తీర్చలేకపోతున్నా..



పది ఎకరాల భూమి ఉంది. ఇంటి నిర్మాణంతో పాటు ఇద్దరు కుమారులకు వివాహం చేయడానికి మొత్తం రూ.40 లక్షలు అప్పులయ్యాయి. బ్యాంకులో రుణం తీసుకుందామనుకున్నా... భూమి విక్రయించాలన్నా చుక్కల భూముల సమస్యగా మారింది. దీంతో అప్పులు తీర్చలేకపోతున్నా. అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితంలేదు.

- మోపూరినాయుడు, ముదిగుబ్బ

ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదు



చుక్కల భూములు సమస్యపై రెవెన్యూ శాఖ కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయింది. ఆర్‌డీఓ, కలెక్టర్‌లకు ఎన్నోసార్లు విన్నవించుకున్నా ఫలితంలేదు. నాలుగు ఎకరాల భూమి ఉంది. పొలంపై రుణం పొందాలన్నా.. విక్రయించాలన్నా ఇబ్బందిగా మారింది.

- కిష్టప్ప, కునుకుంట్ల

సమస్యలు పరిష్కరిస్తాం

- మహేశ్, ఆర్‌డీఓ, ధర్మవరం

సమస్యను త్వరలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. నిజమైన రైతులు సాగులో ఉంటే తప్పకుండా నిషేధిత జాబితా నుంచి తొలగించాలని తహసీల్దార్లకు సూచిస్తాం.

నాయకుల ఒత్తిడితో తెరుచుకోని మద్యం దుకాణాలు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్త మద్యం విధానం అమల్లోకి తెచ్చి, లాటరీ పద్ధతి ద్వారా ప్రైవేటు వ్యక్తులకు దుకాణాలను కేటాయించారు. జిల్లాలో మొత్తం 87 దుకాణాలను లైసెన్స్‌దారులు దక్కించుకున్నారు. ఈ దుకాణాల్లో ఈ నెల 16 నుంచి మద్యం అమ్మకాలు చేపట్టాల్సి ఉండగా, పరిగిలో 2, హిందూపురం పట్టణంలో 1, తలుపులలో 1, పెనుకొండలో 1, సోమందేపల్లిలో 1, ధర్మవరంలో 2 దుకాణాలు ఇంకా ప్రారంభం కాలేదు. దుకాణాల్లో భాగస్వామ్యం కావాలని కొందరు నాయకులు తీవ్ర ఒత్తిడి చేయడంతో లాటరీ దక్కించుకున్న వ్యక్తులు నేటికీ దుకాణాలను ప్రారంభించలేదు. ఎక్సైజ్ పోలీసులు దుకాణాలను ప్రారంభించేందుకు తగు చర్యలు చేపట్టారు.

తెరపివ్వని వాన.. చేనేత కష్టాలు చానా

కార్మికులు : 40 వేలు
మగ్గాలు : 20 వేలు
రోజువారీ కూలి : రూ.400
ఆరు రోజులుగా నష్టపోయిన మొత్తం: రూ.4.80 కోట్లు

ధర్మవరం, న్యూస్‌టుడే: నిత్యం మగ్గం ధ్వని వినిపించే ధర్మవరం పట్టణంలోని చేనేత గృహాలు ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా నిశ్శబ్దంగా మారాయి. ఎడతెరిపి లేని వర్షాలు పడడం, వర్షం నీరు భూమిలో ఇంకి మగ్గాల గుంతల్లోకి నీరు ఊరుతోంది. గుంతల్లోకి నీరు ఊటకి వస్తుండటంతో చేనేత మగ్గంపై పట్టు చీరలు నేసేందుకు వీలు కావడం లేదు. పట్టణంలోని సంజయ్‌నగర్, గీతానగర్, చంద్రబాబునగర్, జోగోనుకుంట, శివానగర్ ప్రాంతాల్లో ఊటనీరు మగ్గం గుంతల్లోకి చేరుతోంది. చేనేత పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కార్మికులు ఆరు రోజులుగా పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజంతా మగ్గం నేస్తే కాని గడవని కుటుంబాలు వారివి. వర్షాలు కురుస్తుండడంతో నేతన్నలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మగ్గాలు నడపలేకపోవడం, ధర్మవరంలో పట్టుచీరల తయారీ తగ్గింది. వర్షాలు పడుతుండడంతో తేమ వాతావరణం వల్ల మగ్గాలు నేసేందుకు కార్మికులకు వీలు కావడంలేదు. మగ్గం గుంతల్లో నీరు చేరిన ప్రాంతాల్లో మగ్గాలను మట్టిపెట్టారు. చేనేత అనుబంధ రంగాల్లో పనిచేసే కార్మికులూ పనులు లేక ఇబ్బంది పడుతున్నారు. వార్పు పట్టడం, రంగుల అద్దకం, చీరల పాలిష్ రంగాల్లో పనిచేసే కార్మికులు ఆరు రోజులుగా పని లేక ఇళ్లకే పరిమితమయ్యారు.

✦ చేనేత కేంద్రమైన ధర్మవరంలో ప్రత్యక్షంగా పరోక్షంగా 40 వేల మందికి పైగా కార్మికులు చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. మగ్గంపై చీరలు నేయాలంటే ఎండ వాతావరణం ఉండాలి. ఆరు రోజులుగా వర్షాలు పడుతుండడంతో, వాతావరణంలో తేమ శాతం ఉండడంతో మగ్గాలు నేసేందుకు వీలు కావడం లేదని ఆరకొరగా మగ్గం నేసినా కూలి సైతం రాకపోవడంతో డబ్బులు లేక అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సి వస్తోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి కోల్పోయిన కార్మికులకు ప్రభుత్వం పరిహారం అందించాలని కోరుతున్నారు.

నీటి ఊటతో మగ్గం తీసేశాను



ఎడతెరిపి లేని వర్షాలతో మగ్గం గుంతలో భారీగా నీటి ఊట వస్తోంది. నీటిని గుంతలో నుంచి తోడేశాం. అయినా ఊట ఆగకపోవడంతో మగ్గాన్ని తీసి పక్కన పెట్టేశా. వర్షాల వల్ల మగ్గం గుంతల్లోకి నీరు చేరి ఉపాధి దెబ్బ తీసింది. నష్టపోయిన కార్మికులకు ప్రభుత్వం నుంచి సాయం అందించాలి.
- శ్రీనివాసులు, కార్మికుడు, గీతానగర్



నిలిచిన మగ్గాన్ని చూపుతున్న కార్మికురాలు శారద

ఉపాధి కోల్పోయాం..

వర్షాలు పడుతుండడంతో వర్షం నీరు భూమిలోకి ఇంకి మగ్గం గుంతల్లోకి నీటి చెమ్మ వస్తోంది. తేమ శాతం అధికంగా ఉండడంతో మగ్గం గుంతలో దిగి మగ్గం నేసేందుకు వీలు కావడంలేదు. ఐదారు రోజులుగా ఉపాధి లేకుండా పోయింది. ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతుండడంతో పైకప్పు నుంచి మగ్గంపై వర్షం నీరు పడకుండా ప్లాస్టిక్ కవర్‌తో కప్పేశాం. ప్రభుత్వం ఆదుకొని ఉపాధి కోల్పోయిన కార్మికులకు పరిహారం ఇవ్వాలి.
- శారద, కార్మికురాలు, చంద్రబాబునగర్, ధర్మవరం

ప్రశాంత జీవనం సాగించాలి



ఉపకారాగారాన్ని తనిఖీ చేస్తున్న న్యాయమూర్తి శ్రీధర్

హిందూపురం, న్యూస్‌టుడే: జైలుకు వచ్చిన నిందితులు తిరిగి తప్పులు చేసి జైలుకు రాకుండా ప్రశాంత జీవనం సాగించాలని సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ సూచించారు. శనివారం స్థానిక ఉప కారాగారాన్ని జడ్జి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కారాగారంలో ఎంత మంది నిందితులు ఉన్నారు. ఏ కేసుల్లో వచ్చారనే విషయాలను జైలు అధికారి అంజినాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. జైలులో ఏమైనా ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారా అని నిందితులను న్యాయమూర్తి ప్రశ్నించగా ఎలాంటి ఇబ్బందులు లేవని తెలిపారు. న్యాయవాదిని ఏర్పాటు చేసుకొనేందుకు ఆర్థిక స్తోమత లేని వారు తమకు దరఖాస్తు చేసుకుంటే ఉచిత న్యాయసాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నవీన్, అంజినమ్మ, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి పాల్గొన్నారు.


భాజపాలో ఆదిమూర్తి చేరిక

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఇ.ఆదిమూర్తి శనివారం ధర్మవరంలో మంత్రి సత్యకుమార్ ఆధ్వర్యంలో భాజపాలో చేరారు. 1985లో నియోజకవర్గంలో ఎన్టీఆర్‌పై కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి రికార్డులకెక్కారు.

వైకాపా కార్యకర్త ఇంట్లో రేషన్ బియ్యం స్వాధీనం

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి మండలం నడిమిపల్లిలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని కదిరి గ్రామీణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నడిమిపల్లికి చెందిన వైకాపా కార్యకర్త పవన్‌కుమార్ ఇంట్లో 42 బస్తాల చౌకడిపో బియ్యం ఉన్నట్లు సమాచారం అందుకున్న కదిరి అప్‌గ్రేడ్ సీఐ మోహన్, సిబ్బందితో కలిసి వెళ్లి తనిఖీ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించినట్లు సీఐ మోహన్ తెలిపారు.

మృతి వార్తతో చలించి.. బాధితుల్ని ఓదార్చి



వెబెక్స్ ద్వారా జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో మంత్రి పయ్యావుల కేశవ్

ఈనాడు, అనంతపురం: జీవిత, ఆరోగ్య బీమాపై శనివారం దిల్లీలో అన్ని రాష్ట్రాల ఆర్థిక, వాణిజ్య పన్నుల శాఖల మంత్రులతో జరిగే సమావేశానికి రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ హాజరు కావాల్సిన తరుణమది. బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పాల్గొన్నారు. మంత్రి పయ్యావుల కేశవ్ నేరుగా పాల్గొనాల్సి ఉంది. అదే సమయంలో తెదేపా నాయకుడి కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వార్త అందింది. రాత్రికి రాత్రి విజయవాడ నుంచి బయలుదేరి ఉరవకొండకు రావాల్సి వచ్చింది. ఆ సమావేశానికి ప్రత్యక్షంగా హాజరు కాలేనని అనుమతి తీసుకొని ఉదయం బాధిత కుటుంబాన్ని ఓదార్చి ధైర్యం చెప్పారు. తర్వాత అనంతరం సమీపంలోని ఓ రెస్టారెంట్‌లో కూర్చుని ల్యాప్‌టాప్ నుంచి వెబెక్స్ ద్వారా సమావేశానికి హాజరై రాష్ట్రం తరపున మాట్లాడారు. బీమా ప్రీమియంపై ప్రస్తుతం ఉన్న 18 శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని సూచించినట్లు పయ్యావుల కేశవ్ తెలిపారు. ఫలితంగా బీమా పాలసీలు సామాన్యులకు అందుబాటులోకి వస్తాయని అభిప్రాయం వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు.

జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి రాజీనామా

అనంతపురం క్రీడలు: జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి తన పదవికి రాజీనామా చేశారు. ఇంకా ఒక ఏడాది పదవీకాలం ఉన్నా రాజీనామా చేయడం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. శనివారం రాజీనామా లేఖను జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డికి ఆయన అందజేశారు. ఇటీవల ప్రకటించిన అండర్-14 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక దుమారం రేపింది. కార్యదర్శిగా ఉంటూ తన కుమారుడిని ఉప సారథిగా ఎంపిక చేయడాన్ని పలువురు తప్పుబట్టారు. కొందరు ఏసీఏ కార్యవర్గ సభ్యులకు ఫిర్యాదు చేశారు. జిల్లా క్రికెట్ సంఘం సభ్యులు, శిక్షకులు, మండల క్రికెట్ సంఘాల సభ్యులు తమ పిల్లలను ఆడించాలన్న ఆరాటంతో ప్రతిభకు పాతరేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆంధ్ర క్రికెట్ సంఘంలోనూ మహిళా విభాగం ఆపరేషన్ మేనేజరుగా ఉన్న మచ్చా రామలింగారెడ్డి ఇటీవల పదవికి రాజీనామా చేశారు.



సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఆర్డీటీ అధికారులు, స్పెయిన్ దేశీయులు

పిల్లలను ఉన్నతంగా చదివించండి

రొళ్ల, న్యూస్‌టుడే: పిల్లలను బాగా చదివించి ఉన్నతులుగా తీర్చిదిద్దాలని ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున, స్పెయిన్ దేశస్థులు ఒంటరి మహిళలకు సూచించారు. శనివారం రొళ్ల ఉన్నత పాఠశాలలో ఒంటరి మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి మహిళ అధైర్యపడకుండా పిల్లలను పైచదువులు చదివించాలని, వాటికి కావలసిన వసతులు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. ఆరేళ్లుగా కుటుంబ పెద్దను కోల్పోయిన మహిళలకు అండగా నిలిచి ఉపాధి కల్పనతో పాటు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఏటీఎల్ ఓబులేసు, సిబ్బంది హనుమంతరాయుడు, ఓబలేసు, చలపతి, బ్రాహ్మణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

గుడిబండ : విద్యార్థులకు అందించిన సైకిళ్లను సద్వినియోగం చేసుకుని సకాలంలో బడులకు చేరుకుని బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని గుడిబండ ఆర్డీటీ ఏటీఎల్ మీనాక్షి సూచించారు. గుడిబండ మండలం ఎస్.రాయాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆర్డీటీ ద్వారా స్పెయిన్‌కు చెందిన దాతలు 118 సైకిళ్లను శనివారం పంపిణీ చేశారు. ఆర్డీ మల్లికార్జున, ఎస్టీఎల్ భాస్కర్‌నాయుడు, ప్రధానోపాధ్యాయుడు రామ్మూర్తి, పాఠశాల కమిటీ ఛైర్మన్ ప్రసన్న పాల్గొన్నారు.

యూట్యూబ్‌లో బోధన చేసే ఉపాధ్యాయులపై విచారణ

కదిరి, కొత్తచెరువు, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉండి యూట్యూబ్‌లో శిక్షణను ఆదాయ మార్గంగా ఎంచుకున్న ఇద్దరిపై డీఈఓ మీనాక్షి విచారణకు ఆదేశించారు. ఎన్పీకుంట మండలంలో పని చేస్తున్న యోగేంద్ర, మడకశిరలో పనిచేసే సూర్యనారాయణరెడ్డి యూట్యూబ్‌లో బోధన చేస్తున్నట్లు కలెక్టరుకు ఫిర్యాదు అందింది. కలెక్టరు ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేశారు. ఉపాధ్యాయులు విధులు మరచి స్వలాభాన్ని ఆశించి ప్రైవేటుగా యూట్యూబ్‌లో పాఠాలు రూపొందించి బోధన చేస్తున్న వారిపై సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ అయ్యాయి. విచారణ అధికారులుగా పెనుకొండ డీవైఈఓ, కదిరి ఎంఈఓలను నియమించారు. సాధారణంగా ప్రభుత్వం నుంచి వేతనం పొందే ఉద్యోగులు ఇతర ఆదాయ మార్గాలకు లోనవకూడదు. అయితే కొందరు ఉపాధ్యాయులు తాము పనిచేస్తున్న పాఠశాల విద్యార్థులను తీర్చిదిద్దటంలో చూపాల్సిన కృషిని పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి యూట్యూబ్‌లో పాఠాలను రూపొందించి సొమ్ము చేసుకోవటాన్ని జిల్లా అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. గతంలో ధర్మవరం మున్సిపల్ పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు సొంతంగా కోచింగ్ సెంటర్ నిర్వహిస్తూ చర్యలకు గురైన విషయం తెలిసిందే. తాజాగా మరో ఇద్దరు ఉపాధ్యాయులు అలాంటి చర్యలకు పాల్పడటం చర్చనీయాంశంగా మారింది. వీరిపై చేపట్టిన విచారణలో తేలే వాస్తవాలను బట్టి తగు చర్యలు తీసుకుంటామని డీఈఓ తెలిపారు.

మహిళా పోలీసు.. యోగాలో బాసు



• జాతీయస్థాయిలో కాంస్య పతకం సాధించిన మంజమ్మ

హిందూపురం, న్యూస్‌టుడే: పోలీసు శాఖలో మహిళలు రాణించటం కష్టంతో కూడుకున్న విషయం. ఒక వైపు విధులు.. మరో వైపు యోగా సాధన చేసి అందులో పట్టు సాధించారు హిందూపురం అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కె.మంజమ్మ. జాతీయస్థాయి పోలీస్ వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ విభాగం యోగా మహిళా పోటీల్లో పాల్గొని కాంస్య పతకం సొంతం చేసుకొని అందరిచేత ప్రశంసలు అందుకున్నారు.

బంగారు పతకం సాధిస్తా



2025లో జరిగే జాతీయ పోటీల్లో మరింత ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధిస్తాను. తర్వాత అంతర్జాతీయ పోటీల్లో రాణించాలని ఉంది. ఈ లక్ష్యంతో యోగా సాధన చేస్తున్నా.. దీనికి శాఖ అధికారులు ప్రోత్సాహం అందిస్తే తప్పక బంగారు పతకం సాధిస్తా. - **మంజమ్మ**

పాఠశాల దశ నుంచి..

మంజమ్మ పాఠశాల దశనుంచి చదువు, ఆటల్లో రాణించారు. కబడ్డీ, పరుగు పందెంలో మంచి ప్రావీణ్యం సాధించి రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొన్నారు. డిగ్రీ మొదటి సంవత్సరంలోనే కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. శాఖాపరంగా నిర్వహించే జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు అనంతపురం వెళ్లిన ఆమె సీనియర్లను చూసి యోగాపై ఆకర్షితురాలయ్యారు. యోగా శిక్షకులు కృష్ణవేణి, సీనియర్ చలపతి, స్నేహితులు దీపతో కలసి నెల రోజులు సాధన చేశారు. మంచి ప్రావీణ్యం కనబరుస్తుండటంతో జిల్లా నుంచి మంజమ్మను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అక్కడ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికవ్వడంతో విశాఖపట్నంలో రెండు మాసాలు శిక్షణ ఇచ్చారు. ఛండీగఢ్‌లోని బిలాయ్‌పూర్‌లో గత నెల 23 నుంచి 27 వరకు జరిగిన ఆల్ ఇండియా పోలీస్ వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ విభాగం యోగా మహిళా పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సొంతం చేసుకున్నారు. జాతీయ స్థాయిలో రాణించిన మంజమ్మను రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు, రాష్ట్ర పోలీస్ అధికారులు, జిల్లా ఎస్పీ రత్న, డీఎస్పీ మహేశ్, సీఐ ఆంజనేయులు, పోలీస్ శాఖ అధికారులు అభినందించారు.

దారి తప్పాం.. యజమానికి అప్పగించండి!

పోలీస్ స్టేషన్‌కు చేరిన ఎద్దులు



స్టేషన్ ఎదుట ఎద్దులు

శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి సాయినగర్‌కు చెందిన రైతు పెద్దన్న ఎద్దులు శనివారం సాయంత్రం 7 గంటలకు దారితప్పి ఏకంగా పోలీస్ స్టేషన్‌కు చేరాయి. తాము దారి తప్పాం.. మా యజమానికి అప్పగించండనే విధంగా అవి నేరుగా స్టేషన్ వద్దకు చేరడంతో ఎస్సై రమేశ్‌బాబు, ఏఎస్సై మురళీమోహన్, హెచ్‌సీలు, సిబ్బంది ఆశ్చర్యం వ్యక్తం చేయడం విశేషం. వాటిని స్టేషన్ ఎదురుగా కట్టేసి సమాచారాన్ని ఎస్సై సామాజిక మాధ్యమాల్లో ఉంచడంతో వెంటనే రైతు పెద్దన్న దంపతులు స్టేషన్‌కు చేరుకున్నారు. వారిని హెచ్చరించి, ఎద్దులను అప్పగించారు. **-న్యూస్‌టుడే, సోమందేపల్లి**

అత్యాచార బాధితుల వాంగ్మూలం నమోదు

ఉరవకొండ, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలంలో ఈ నెల 12న దుండగుల చేతిలో సామూహిక అత్యాచారానికి గురైన అత్త, కోడలును పోలీసులు శనివారం ఉరవకొండ కోర్టుకు తీసుకువచ్చారు. బాధితుల వాంగ్మూలాన్ని ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి దుర్గాకల్యాణి నమోదు చేశారు. వీడియోగ్రఫీ ఆధారంగా ఈ ప్రక్రియ చేపట్టారు. నిందితులకు వేగవంతంగా శిక్ష పడేలా చేయడానికి ఈ చర్యలు చేపట్టినట్లు తెలిసింది.

హిందూపురం
• హిందూపురం • పెనుకొండ • మడకశిర

తాళ్లను ముడివేస్తూ.. శిక్షణ పొందుతూ..


తాళ్లను ముడి వేసే ప్రక్రియ నేర్చుకుంటున్న విద్యార్థులు

లేపాక్షి, న్యూస్‌టుడే: మండలంలోని పులమతి ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం శనివారం కొనసాగింది. రెండోరోజు పిల్లలకు తాళ్లను ముడి వేయడం, దిక్సూచి ఎలా ఉపయోగించాలి, ప్రథమ చికిత్స ఏ విధంగా చేయాలనే అంశాలను శిబిరం కోఆర్డినేటర్ ప్రసాద్, జిల్లా కార్యదర్శి గిరిధర్‌లు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు, వ్యాయామ ఉపాధ్యాయుడు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల అక్రమ రవాణా అరికట్టాలని ప్రదర్శన

పెనుకొండ, న్యూస్‌టుడే: మహిళల అక్రమ రవాణా అరికట్టాలని డిమాండ్ చేస్తూ శనివారం పట్టణంలోని గాంధీ కూడలి నుంచి ప్రధాన వీధుల గుండా పాఠశాలల విద్యార్థులతో కలసి సహిత స్వచ్ఛంద సంస్థ వాక్‌ఫర్ ఫ్రీడం పేరుతో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. సీఐ రాఘవన్, ఎస్సై వెంకటేశ్వర్లు, సంస్థ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, స్వచ్ఛందసంస్థ ప్రతినిధులు

భారీ వర్షాలకు కూలిన ప్రహరీ

సోమందేపల్లి : సుద్దకుంటపల్లి పాఠశాల ప్రహరీ శుక్రవారం అర్ధరాత్రి నేలకూలింది. ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తడిసిపోయిన ప్రహరీ పడిపోయింది. అయితే ఈపాఠశాలలో 21 మంది విద్యార్థులున్నారు. వారు లేని సమయంలో కావడం..ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

భూ రీసర్వే సమస్యలపై గ్రామసభలు

పెనుకొండ: మండలంలోని వనుదేవపురం రెవెన్యూ పొలాలకి సంబంధించి వెంకటరెడ్డిపల్లి గ్రామంలో శనివారం తహసీల్దార్ కె.శ్రీధర్ ఆధ్వర్యంలో భూ రీసర్వే సమస్యలపై గ్రామసభ నిర్వహించారు. 12అర్జీలు వచ్చాయని తహసీల్దార్ వివరించారు.

మడకశిర గ్రామీణం: కల్లుమర్రి పంచాయతీలో తహసీల్దార్ కరుణాకర్ గ్రామ సభ నిర్వహించారు. 14 దరఖాస్తులు వచ్చాయి.

సోమందేపల్లి : బ్రాహ్మణపల్లిలో ఉప తహసీల్దార్ రెడ్డిశేఖర్ గ్రామసభ నిర్వహించారు. రైతులు అర్జీలు ఇవ్వడంతో పరిష్కరిస్తామని తెలిపారు.

అంధకారంలో అంగన్‌వాడీ కేంద్రాలు

విద్యుత్తు బిల్లుల బకాయితో సరఫరా నిలిపివేత

మడకశిర గ్రామీణం, హిందూపురం, గుడిబండ, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుత్తు బిల్లుల బకాయిలు పేరుకుపోతున్నాయి. మూడేళ్లుగా వీటిని చెల్లించకపోవడంతో రూ.లక్షల్లో బకాయి న్నాయి. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా నిలిపేయడంతో సిబ్బంది, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. చాలా భవనాల్లో గాలి, వెలుతురు సక్రమంగా రావడం లేదు. ప్రభుత్వం చేపట్టే వివిధ కార్యక్రమాలకు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు ఇరుకైన చీకటి గదుల్లో అసౌకర్యానికి గురవుతున్నారు.

● మడకశిర నియోజకవర్గంలో మడకశిర, గుడిబండ ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి. వీటి పరిధిలో 438 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో ప్రభుత్వ భవనాలు, అద్దె భవనలు, అద్దె చెల్లించనవి ఉన్నాయి.

ప్రాజెక్టుల వారీగా సొంత, అద్దెభవనాలు:

ప్రాజెక్టు	అంగన్‌వాడీ కేంద్రాలు	సొంత భవనాలు	అద్దె భవనాలు
మడకశిర	269	155	65
గుడిబండ	169	91	78
హిందూపురం	330	98	184

రూ.36 లక్షలు చెల్లించాల్సిన ఉంది

ఈ మూడు ప్రాజెక్టుల పరిధిలో సొంత, అద్దె భవనాలకు మూడేళ్లగా బిల్లులు చెల్లించకపోవడంతో సుమారు రూ.36 లక్షల వరకు బిల్లులు పేరుకుపోయాయి. బిల్లు బకాయిలు చెల్లించని కారణంగా అధికారులు కనెక్షన్లు తొలగించారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలు చీకట్లో మగ్గుతున్నాయి.

ఒక్క కేంద్రంలో రూ.10,518

మడకశిర మండలం పాపసానిపల్లి అంగన్‌వాడీ కేంద్రానికి 2021 మే నెల నుంచి విద్యుత్తు బిల్లు కట్టలేదు. అక్టోబరు నెలకు అది రూ.10,518కి చేరింది. బకాయి చెల్లించని కారణంగా మూడేళ్ల కిందటే కనెక్షన్ తొలగించారు. అయినా నెలనెలా బిల్లులు మాత్రం కట్టాల్సిన పరిస్థితి నెలకొందని సిబ్బంది వాపోతున్నారు.




మూడేళ్లుగా విద్యుత్తు సరఫరా లేని పాపసానిపల్లి అంగన్‌వాడీ కేంద్రం

నిధులు రావాల్సి ఉంది

అంగన్‌వాడీ కేంద్రాల విద్యుత్తు బిల్లులకు సంబంధించి నిధులు విడుదల కావాల్సి ఉంది. విడుదలైన వెంటనే చెల్లించి అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా పునరుద్ధరించేందుకు చర్యలు చేపడతాం.
-నాగమల్లేశ్వరి, సీడీపీఓ, మడకశిర

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

హిందూపురం: 80085 73018, పెనుకొండ: 91000 20922, మడకశిర: 76759 19016


సమస్య: బూదిపల్లిలో వీధి దీపాలు వెలగడం లేదు. **-రాజగోపాల్**
సమాధానం: రెండు రోజుల్లో చేస్తాం. **-నరసమ్మ, సర్పంచి, జలమ్మలబండ**
సమస్య: తిమ్మలాపురంలో తాగునీటి సమస్య ఉంది. **-భీమరాజు**
సమాధానం: సమస్య పరిష్కరిస్తాం. **-రంగస్వామి, సర్పంచి, తాళికెర**
-న్యూస్‌టుడే, గుడిబండ

సమస్య: హిందూపురం పట్టణం ఆటోనగర్‌లో వర్షపునీరు నిలిచి అపరిశుభ్రంగా ఉంది. **-నబీరసూల్**
సమాధానం: బురదను తొలగించి, ప్రత్యామ్నాయంగా మట్టిని వేయిస్తాం. **-సంగం శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్**
సమస్య: బసవేశ్వరనగర్‌లో పందుల స్వైరవిహారం చేస్తూ నివాసగృహాల సమీపంలో అపరిశుభ్రంగా తయారైంది. **-శాంతమ్మ**
సమాధానం: రెండురోజుల్లో శుభ్రం చేయించి పందుల యజమానులకు నోటీసులు ఇస్తాం. **-నటరాజు, ఈవోఆర్డీ**
-న్యూస్‌టుడే, హిందూపురం గ్రామీణం

సమస్య : పి.కొత్తపల్లిలో రహదారుల్లో బురదను తొలగించండి. **-బాబు**
సమాధానం : పరిశీలించి చర్యలు చేపడతాం. **-రమేశ్ చల్లా, పంచాయతీ కార్యదర్శి, పెద్దమంతూరు**
సమస్య : ఎం.కొత్తపల్లిలో 11కేవీ తీగలకు చెట్టు కొమ్మలు తగిలి విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. **-వీరన్న**
సమాధానం : చర్యలు తీసుకొంటాం. **-శ్రీనివాసమూర్తి, ఏఈ, రొద్దం.**
-న్యూస్‌టుడే, రొద్దం

చంద్రభానుకు పురస్కారం

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన అభిజ్ఞ నృత్యాలయం వారు శనివారం ఉడిపి శ్రీకృష్ణ ఆలయం వద్ద 14గంటలసేపు వంద మంది విద్యార్థినులతో శ్రీకృష్ణుని నృత్య నీరాజనం చేసి కర్ణాటక బుక్‌ఆఫ్ రికార్డును నెలకొల్పారు. ఈ సందర్భంగా అశ్వర్థ నారాయణ స్వామి చేతుల మీదుగా కర్ణాటక బుక్ ఆఫ్ రికార్డును 'పురం' వాసి చంద్రభాను అందుకున్నారు. అదేవిధంగా నృత్యాలయం రోహిని, నీహస్విలు ప్రశంశాపత్రాలు అందుకున్నారు.


కర్ణాటక బుక్ ఆఫ్ రికార్డును అందుకుంటున్న చంద్రభాను


సిమెంటు కాలువల నిర్మాణంలో నిర్లక్ష్యం

పురపాలక సంఘం :	హిందూపురం
ప్రాంతం :	బాలాజీనగర్
నివాసగృహాలు :	140
జనాభా:	570

బాలాజీనగర్ (హిందూపురం (గ్రామీణం), న్యూస్‌టుడే: హిందూపురం పురపాలక సంఘం పరిధిలోని బాలాజీనగర్‌లో కొన్నేళ్లుగా అధికారులు సిమెంటు కాలువలు నిర్మించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. గతంలో మున్సిపల్ నిధులు రావడంతో కొన్ని రోడ్లలో మాత్రమే కాలువలు ఏర్పాటు చేశారే తప్ప ఇటీవల కొత్తగా నిర్మించిన దాఖలాలు లేవని ఆరోపిస్తున్నారు. ప్రజలే స్వయంగా సిమెంటు పైపులు అమర్చుకొని ఇళ్లల్లో నుంచి వచ్చే మురుగు నీటిని ప్రధాన కాలువకు పంపుకొంటున్నారు. ఇంటి పన్నులు, నీటి వినియోగ పన్నులను ముక్కుపిండి వసూళ్లు చేసే మున్సిపల్ అధికారులు కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించడంలో పట్టించుకోవడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగుపరుస్తాం

నిధులున్నా కాలువలను గతంలో ఎందుకు ఏర్పాటు చేయలేదనే వాటిని పరిశీలిస్తాం. కాలనీలో శాశ్వత పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగుపరచేలా చర్యలు తీసుకుంటాం.
-సంగం శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్


ప్రజలు ఏర్పాటు చేసుకున్న పైపుల ద్వారా కాలువలోకి మురుగు నీరు

ఒరిగిన చెట్టు.. జరభద్రం.!

హిందూపురం పట్టణంలోని బీఎస్‌టీ పెట్రోల్‌బంకు వెనుక భాగాన ఉన్న రహదారిలో చెట్టు రోడ్డు వైపు కిందకు వాలిపోయింది. ఈ రహదారి చుట్టుపక్కన వందల నివాసగృహాలు ఉన్నాయి. నిత్యం వందలాది మంది సంచరిస్తుంటారు. ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులును వివరణ కోరగా సిబ్బందిని పంపి చర్యలు తీసుకుంటామన్నారు. **-న్యూస్‌టుడే, హిందూపురం అర్బన్**



బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

లేపాక్షి, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రం నగరిగెర ప్రధాన రహదారి నుంచి మైదుగోళం వెళ్లే బీటీ రహదారి నిర్మాణానికి శనివారం సర్పంచి రామచంద్రారెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే గ్రామానికి రూ.70లక్షలతో నూతన రహదారిని ఏర్పాటు చేయడం ఎంతో హర్షణీయమని గ్రామస్థులు పేర్కొన్నారు. ఎంపీడీవో నరసింహమూర్తి, ఏపీవో మధుసూదన్‌రెడ్డి, ఈవోఆర్డీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి బలవన్మరణం

పెనుకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆల్విన్‌కాలనీకి చెందిన లక్ష్మీనరసమ్మ(80) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. శుక్రవారం రాత్రి మనస్తాపం చెంది ఇంట్లో విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. అక్కడ శనివారం మధ్యాహ్నం మృతిచెందింది. మృతురాలి కుమారుడు రాఘవేంద్ర ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు వివరించారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, న్యూస్‌టుడే: మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని కుటుంబ సమస్యల నేపథ్యంలో శనివారం విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గుర్తించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం 108 వాహనంలో హిందూపురం పంపించారు.

రెవెన్యూ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

హిందూపురం, న్యూస్‌టుడే: రెవెన్యూ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు న్యాయమూర్తి కంపల్లె శైలజ సూచించారు. శనివారం స్థానిక కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించి బాధితుల నుంచి సమస్యలను వినతుల రూపంలో స్వీకరించారు. స్థానిక రైల్వే రోడ్ విస్తరణలో మున్సిపల్ అధికారులు ముందస్తుగా తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, పరిహారం చెల్లించకుండా హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నా తమ దుకాణాలు తొలగించారని పలువురు వ్యాపారులు న్యాయమూర్తికి ఫిర్యాదు చేశారు. పట్టణంలో ప్రైవేట్ నర్సింగ్ హోమ్, క్లినిక్‌ల నిర్వాహకులు బయోవ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయటం, మున్సిపల్ వాహనాలకు బయోవ్యర్థాలను అందిస్తుండటతో భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులకు గురికావల్సి వస్తోందని న్యాయవాది నవేరా ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసులరెడ్డి, న్యాయవాది సుదర్శన్, సిద్ధూ, నాగరాజురెడ్డి, వన్నెరప్ప, సంతోషికుమారి పాల్గొన్నారు.


కేసులు పరిష్కారంపై చర్చిస్తున్న జిల్లా అదనపు జడ్జి శైలజ

సంక్షేమ పథకాలు విద్యార్థులకు అందేలా చూడండి

గోరంట్ల, న్యూస్‌టుడే: వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థుల కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని, అవి వారికి చేరేవిధంగా చర్యలు తీసుకోవాలని పెనుకొండ సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవన్ ప్రిన్సిపాల్ విజయకుమార్‌ను ఆదేశించారు. గోరంట్లలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలను న్యాయమూర్తి శనివారం సందర్శించారు. పట్టిక ప్రకారం వేళకు ఆహారం అందుతుందా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అలాగే గురుకుల పాఠశాలలో మౌలిక వసతులపై ఆరా తీశారు. వంటగది, మరుగుదొడ్లు, స్నానపుగదులను స్వయంగా పరిశీలించారు. పిల్లలకు సమస్యలు ఎదురైతే పెనుకొండ కోర్టులో ఉన్న న్యాయసేవాసమితిలో అర్జీ ద్వారా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని వివరించారు. స్థానిక పోలీసులు, కోర్టు సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థినులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి వాసుదేవన్

వృథా నీరు.. ట్యాంకు చుట్టూ మురుగు

ఎముకలగుట్టపల్లిలో నీటిట్యాంకు చుట్టూ అపరిశుభ్రత తాండవిస్తోంది. ట్యాంకువద్ద వృథానీరు మురుగుతో కలిసి రోడ్డుపైకి వస్తోందని, మరోవైపు ట్యాంకువద్దకు వెళ్లి నీరు పట్టుకోవడం ఇబ్బందిగా మారిందని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ సమస్యను సర్పంచి మణి దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. **-న్యూస్‌టుడే, గోరంట్ల**



భక్తిశ్రద్ధలతో వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ


దుద్దేబండలో వాల్మీకి విగ్రహప్రతిష్ఠలో తెదేపా శ్రేణులు

పెనుకొండ, న్యూస్‌టుడే: దుద్దేబండలో శనివారం వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముఖ్య అతిథిగా తెదేపా నాయకుడు వెంకటేశ్వరరావు హాజరై పూజలు నిర్వహించారు. తెదేపా శ్రేణులు, వాల్మీకి సంఘం నాయకులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా మండలంలోని మరువపల్లిలో, పట్టణ పరిధిలోని ఇస్లాపురంలో జ్యోతుల ఉత్సవం నిర్వహించారు.

పరిగి : పరిగిలో వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి, కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేశారు. స్థానిక వాల్మీకి సంఘం నాయకులతో పాటు, తెదేపా నాయకులు పాల్గొన్నారు. యర్రగుంటలో మహిళలు జ్యోతుల ఉత్సవం నిర్వహించారు.

రొద్దం : నల్లూరులో జ్యోతులతో ఊరేగింపుగా వాల్మీకి సంఘం నాయకులు, మహిళలు ఆలయం వద్దకు చేరుకుని మహర్షి విగ్రహానికి సమర్పించారు.

హిందూపురం: హిందూపురం పట్టణంలోని శ్రీకంఠపురంలో ప్రత్యేకంగా తయారు చేసిన దీపాలను పట్టణంలో ఊరేగింపుగా తీసుకెళ్లి వాల్మీకి ఆలయంలో హారతి ఇచ్చారు. వాల్మీకి ఉత్సవ విగ్రహం దాత గీతాలక్ష్మి, కౌన్సిలర్లు డీఈ రమేశ్‌కుమార్, మంజుళ, నాయకులు సూరి, ఎన్‌బీకే రాజు, శివశంకర్, తిమ్మయ్య, వెంకటేశ్, కదిరప్ప, నవీన్, వాల్మీకి సంఘం నాయులు పాల్గొన్నారు.


హిందూపురంలో జ్యోతుల ఊరేగింపు


సోమందేపల్లి: వాల్మీకి విగ్రహానికి పూజలు చేస్తున్న వాల్మీకి/బోయ సంఘం నాయకులు


పట్టణంలోని కన్యకాపరమేశ్వరి వీధిలోని కొల్హాపుర మహాలక్ష్మికి మట్టి కుండల్లో తెచ్చిన పాలతో అభిషేకం చేస్తున్న వేద పండితులు **-న్యూస్‌టుడే, హిందూపురం అర్బన్**

రహదారి మడుగైంది..!

గొల్లపల్లి నుంచి చిగతుర్పి వెళ్లే రోడ్డు వర్షం వస్తే చాలు ప్రయాణించలేని పరిస్థితి. మట్టి రోడ్డు కావడంతోపాటు గుంతలమయం కావడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ డీఈ జగదీశ్ గుప్త మాట్లాడుతూ మట్టి రోడ్డును బీటీగా మార్చడానికి చర్యలు తీసుకుంటామన్నారు. **-న్యూస్‌టుడే, గుడిబండ**



పశువులను వీధుల్లోకి వదిలితే చర్యలు

సోమందేపల్లి, న్యూస్‌టుడే: సోమందేపల్లిలో పలువురు రైతులు, కాపరులు తమ పాడి పశువులను వీధులు, రహదారులపైకి వదిలేసి, ప్రజలు, వాహన చోదకులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇది మంచిది కాదని ఎస్సై రమేశ్‌బాబు హెచ్చరించారు. శనివారం రాత్రి కొత్తపల్లి మలుపు వద్ద హిందూపురం ప్రధాన ర.భ రహదారిపైకి పదుల సంఖ్యలో పాడి పశువులు, దూడలు చేరి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నట్లు ఆయన గుర్తించారు. ఎవరైనా తమ పశువులను రోడ్లపైకి వదిలేస్తే గోశాలకు తరలిస్తామని ఎస్సై అందరికీ హెచ్చరికలు చేశారు.


కొత్తపల్లి మలుపు వద్ద రహదారిపై ఉన్న పాడి పశువులను పరిశీలిస్తున్న ఎస్సై రమేశ్‌బాబు, సిబ్బంది

కోలాటం, నృత్యాలతో కీర్తి.. మహిళల స్ఫూర్తి


కోలాటం సాధన చేస్తున్న ఆర్యవైశ్య యువమహిళా సంఘం సభ్యులు

గోరంట్ల, న్యూస్‌టుడే: సాధారణంగా ఆర్యవైశ్య మహిళలంటే వ్యాపారం, ఇంటిపనులకే పరిమితం అనుకుంటాం. కాని గోరంట్లలో ఆర్యవైశ్య యువ మహిళా సంఘం సభ్యులు వీటితోపాటు కళారంగంలో రాణిస్తున్నారు. ఇప్పటికే తమ ప్రతిభను పలు ఆలయాల్లో ప్రదర్శించారు. నవ్య అనే మహిళ చిన్ననాడు నేర్చుకున్న విద్యను తోటివారికి నేర్పిస్తున్నారు. అందరూ కలిసి గోరంట్ల కన్యకపరమేశ్వరీ ఆలయంలో పండుగల సమయంలో ప్రత్యేకంగా ఏకరూపదుస్తులతో కోలాటం, నృత్యం ప్రదర్శనలు ఇస్తున్నారు.

● కోలాటం, నృత్యాలతో కాణిపాకం వినాయక, కదిరిలోని ఖాద్రి లక్ష్మీనృసింహాలయం, కర్ణాటకలోని ఎల్లోడు ఆదినారాయణస్వామి ఆలయాల్లో తమ ప్రతిభతో సభికులను ఆకట్టుకునేలా చేశారు. దసరా నవరాత్రోత్సవాల్లో భాగంగా వాసవీమహల్‌లో కన్యకపరమేశ్వరి అమ్మవారికి నిత్యం ప్రత్యేక పూజలు, అలంకరణలు, కంకుమార్చనలు కొనసాగుతున్నాయి. వాటితోపాటు వీరి కోలాటంతో అందరిని కనువిందుచేస్తున్నారు.

● భరతనాట్యం, కూచిపూడి సాధన చేసే ఆలోచనలో: ప్రస్తుతం కోలాటంలోని ఎన్నో రకాల కార్యక్రమాలు, కొన్ని నృత్యాలు మాత్రం చేస్తున్న వీరు భవిష్యత్తులో భరతనాట్యం, కూచిపూడి సాధన చేయాలన్న ఆలోచనలో ఉన్నట్లు చెబుతున్నారు.

పాఠశాల స్థాయిలో నేర్చుకున్నా.. - నవ్య



నేను 15 ఏళ్ల క్రితం పాఠశాల స్థాయిలో నేర్చుకున్నారు. ప్రస్తుతం మా ఆర్యవైశ్య మహిళలకు రెండేళ్లకు పైగా నేర్పుతున్నాను. దీంతో ఎక్కడికి వెళ్లినా మాబృందానికి ప్రత్యేక గౌరవం లభిస్తోంది. తిరుమల వెంకన్న సన్నిధిలో ప్రదర్శన ఇవ్వాలన్నదే మా లక్ష్యం. అందుకోసం ప్రత్యేకంగా సాధన చేస్తున్నాం.


కాణిపాకంలో ప్రశంసాపత్రాలు అందుకొంటూ..

నిర్మిస్తామంటే.. అనుమతులు ఇవ్వరే?

ఇరుకుగదిలో విద్యార్థుల అవస్థలు


చంద్రగిరిలో ప్రాథమిక పాఠశాలలో దెబ్బతిన్న పైకప్పు

పెనుకొండ, న్యూస్‌టుడే: పాఠశాల నిర్మాణానికి కియా అనుబంధ పరిశ్రమలు ముందుకొచ్చినా అనుమతులు ఇవ్వడంలో అధికారుల కాలాయపన చేస్తున్నారు. మండలంలోని చంద్రగిరి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల పైకప్పు పూర్తిగా శిథిలమైంది. గ్రామంలో 70 ఏళ్ల కిందట ఓ తరగతి గదిని నిర్మించారు. విద్యార్థుల సంఖ్య పెరుగుతుండడంతో 40 ఏళ్ల క్రితం మరో భవనం నిర్మించారు. ప్రస్తుతం పాత భవనం కొన్నేళ్లుగా వర్షాకాలంలో కారుతోంది. ఉన్న ఒక్క భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వం నాడు నేడులో కనీసం మరమ్మతులకు నిధులు మంజూరు చేయకపోవడంతో భవనాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాత భవనం పైకప్పు నుంచి నీరు కారడంతో బండలు ఊడిపడుతున్నాయి. మరో గది సైతం పూర్తిగా కారుతోంది. ప్రస్తుతం పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు, 27మంది విద్యార్థులున్నారు. వర్షాలకు పాఠశాల గదులు కూలుతాయన్న భయంతో శనివారం నుంచి పాఠశాల ఆవరణలోని పైకా గదిలో ఒకటి నుంచి ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు.

● సీఎస్ఆర్‌లో తరగతి గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు కియా, అనుబంధ సంస్థల ద్వారా సీఎస్ఆర్(కార్పొరేట్ సోషియల్ రెస్పాన్సిబులిటీ)లో పాఠశాలకు అవసరమైన నూతన తరగతి గదులను నిర్మించేందుకు హ్యూండాయ్ స్టీల్ యాజమాన్యం ముందుకొచ్చారు. జిల్లా కలెక్టరేట్ నుంచి అనుమతులు అందలేదు. జిల్లా అధికారుల నుంచి అనుమతులు రాకపోవడంతో నిర్మాణం ఆలస్యమైందని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు.


చంద్రగిరి ప్రాథమిక పాఠశాల ఆవరణలోని పైకా గదిలో చదువుతున్న విద్యార్థులు

పైకా భవనంలో తరగతులు

ప్రమాదకరంగా పాఠశాల గదులను వదిలేసి, పాఠశాల ఆవరణలో ఉన్న పైకా భవనంలో తగతులు నిర్వహించే విధంగా హెచ్ఎంకు సూచించాం. త్వరలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేవిధంగా చర్యలు చేపడతాం.
-చంద్రశేఖర్, సుధాకర్, ఎంఈవోలు, పెనుకొండ

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం ట్రినిటి సర్వీసస్ ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. బెంగళూరు శంకర్ ఆస్పత్రి నుంచి వచ్చిన వైద్యురాలు నేహా, భవాని, క్యాంపు ఇన్‌చార్జి శివప్రకాష్, వారి సిబ్బంది 277మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. అందులో 106 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు.

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం • కదిరి •రాప్తాడు

ఉద్యోగాలకు పలువురి ఎంపిక


అభ్యర్థికి మౌఖిక పరీక్ష నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధి

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే : ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనా శాఖ, సీడాప్ సంయుక్తంగా శనివారం ధర్మవరంలోని పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన ఉద్యోగ మేళాలో 32 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సురేశ్‌బాబు తెలిపారు. మేళాకు 59 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వివిధ కంపెనీల ప్రతినిధులు ముఖాముఖి నిర్వహించారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్లేస్‌మెంట్ అధికారి తేజకుమార్, సీడాప్ డీపీఎం నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఖాద్రీశుడి చెంత భక్తుల కిటకిట


ఆలయంలో బారులు తీరిన భక్తజనం

కదిరి, న్యూస్‌టుడే : శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ కనిపించింది. శనివారం కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. వర్షం కురుస్తున్నా స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. ధ్వజస్తంభం వద్ద దీపారాధన చేశారు. మొక్కులు తీర్చుకునేలా తులాభారం, తలనీలాలు సమర్పించారు. హుండీలో ముడుపులు చెల్లించారు. దర్శన భక్తులకు ప్రసాదం అందించారు. అన్నదాన సత్రంలో భోజన ప్రసాదాన్ని వితరణ చేశారు.

యోగాతో ఒత్తిడికి ఉపశమనం

కొత్తచెరువు, న్యూస్‌టుడే : మానసిక, శారీరక ఒత్తిడిని అధిగమించడానికి యోగా ఎంతో తోడ్పడుతుందని యోగా గురువు తుమ్మల నారాయణరెడ్డి, జనతా సొసైటీ అధ్యక్షుడు అరుణ్ ప్రశాంత్ పేర్కొన్నారు. కొత్తచెరువులో జనతా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత యోగా తరగతులు ఆరో రోజు కొనసాగాయి. స్థానిక భజన మందిరంలో ఉదయం 6.30 నుంచి 7.30 వరకు యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు చంద్రశేఖర్, జయరామ్, రవిశంకర, శివసాయి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

బత్తలపల్లి, న్యూస్‌టుడే : విజయవాడలో గత నెలలో వచ్చిన వరదల కారణంగా నష్టపోయిన ప్రజలను ఆదుకోవడానికి బత్తలపల్లిలోని రిటైర్డ్ హెడ్‌మాస్టర్ చంద్రశేఖర్ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.10 వేలు విరాళం అందజేశారు. శనివారం మాల్యవంతంలో జరిగిన పల్లె పండగ కార్యక్రమంలో ఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్ యాదవ్‌కు చెక్కును అందజేశారు.

సచివాలయం తనిఖీ

కదిరి గ్రామీణం : కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి గ్రామ సచివాలయాన్ని శనివారం కదిరి డీఎల్‌డీఓ పోలప్ప తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరును పరిశీలించి, ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించి, విధి నిర్వహణలో క్షేత్ర ప్రాంతాలకు వెళ్లినప్పుడు మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివశంకర్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

అడుగేయాలంటే.. బురద తొక్కాల్సిందే..!


గుంతలమయంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వీధి

కదిరి ఆర్.ఎస్. (కదిరిపట్టణం), న్యూస్‌టుడే : వాయుగుండం ప్రభావంతో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో పట్టణ రహదారులన్నీ బురదగుంటల్లా మారాయి. అడుగు వేయాలంటే అడుసు తొక్కాల్సిందేనన్నట్లు మారింది. ప్రధానంగా పట్టణంలోని జీనోదు సమీపంలో వీరబ్రహ్మేంద్రస్వామి మిగులడివెళ్లే మార్గం వానలబారిన గుంతలమయంగా మారింది. పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు ఈ దారిలో వెళ్లాలంటే భయపడుతున్నారు. వీరబ్రహ్మేంద్రస్వామిగుడితో పాటు ప్రైవేటు కళ్యాణ మండపాలు ఉన్నాయి. పెళ్లిళ్ల ఇతర శుభకార్యాలయాలకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అడపాలవీధిలోని మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలకు వెళ్లే ప్రధాన మార్గం బురదగుంటను తలపిస్తోంది. మురుగు కాలువలు లేనందున వర్షపు నీరు మొత్తం రోడ్డుపైనే చేరడంతో రాకపోకలకు వీల్లేకుండా పోయింది. ఇందిరా కాలనీలోనూ రోడ్ల పరిస్థితి మరింత ఇబ్బందిగా ఉందని స్థానికులు వాపోతున్నారు. ఎడతెరిపి లేకుండా పడుతున్న వాన వల్ల రహదారులు దెబ్బతినడం, అపరిశుభ్రంగా మారడం వల్ల పట్టణవాసులు అసౌకర్యానికి గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మరమ్మతులకు చర్యలు

వర్షాలవల్ల దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు అంచనాలు సిద్ధం చేయాలని ఇప్పటికే సిబ్బందికి సూచించాం. అన్ని ప్రాంతాల్లో అధ్వానంగా ఉన్న రోడ్ల వివరాలను సేకరించి ప్రతిపాదనలు సిద్ధం చేసుకుని పాలకవర్గం అనుమతితో వీలైనంత త్వరగా పూర్తి చేస్తాం. **- కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, కదిరి**

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

పుట్టపర్తి: 80085 73039, కదిరి: 80085 73033, ధర్మవరం: 99596 98222

సమస్య : ధర్మవరంలోని ఉన్నత పాఠశాల మైదానంలోకి వెళ్లే దారిలో ఇరువైపులా మూత్ర విసర్జన చేస్తుండటంతో దుర్వాసన వస్తోంది. రోజూ వాకింగ్ కోసం వస్తున్న వారు, మహిళలు, బాలికలు ఇబ్బంది పడుతున్నారు. **- వాకర్స్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు**

సమాధానం : మైదానానికి వెళ్లే మార్గంలో మూత్రవిసర్జన చేయకుండా చర్యలు తీసుకుంటాం. **- కేశవ, మున్సిపల్ శానిటేషన్ అధికారి, ధర్మవరం** - న్యూస్‌టుడే, ధర్మవరం పట్టణం


సమస్య : టి.రెడ్డివారిపల్లిలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రిళ్లు ఇబ్బందిగా ఉంది. **- శ్రీనివాసులు టి.రెడ్డివారిపల్లి**

సమాధానం : పరిశీలించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- అనిల్‌కుమార్, ఇన్‌ఛార్జి కార్యదర్శి, తలుపుల**

సమస్య : మెయిన్ బజారు తాగునీటి సరఫరా సక్రమంగా రావడంలేదు. రెండు మూడ్రోజులకు ఒక్కసారి కూడా రావడం లేదు. **- రవి, తలుపుల**

సమాధానం : పరిశీలించి తాగునీరు అన్ని వీధులకు సక్రమంగా సరఫరా అయ్యేలా చూస్తాం. **- అనిల్‌కుమార్, ఇన్‌ఛార్జి కార్యదర్శి, తలుపుల** - న్యూస్‌టుడే, తలుపుల

శతకంతో కదం తొక్కిన తేజదీపిక


తేజదీపిక


చందన


బృంద

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే : జిల్లా క్రికెట్ అసోసియేషన్, ఆర్డీటీ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న రూరల్ క్రికెట్ లీగ్ పోటీల్లో ధర్మవరం అండర్-16 అమ్మాయిల జట్టు విజయపరంపర కొనసాగిస్తోంది. శనివారం పట్టణంలోని ఆర్డీటీ మైదానంలో ధర్మవరం, పెనుగొండ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ దిగిన ధర్మవరం జట్టు నిర్ణీత 30 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 287 పరుగులు చేసింది. తేజదీపిక 102 బంతుల్లో 142 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పెనుగొండ జట్టు 16.4 ఓవర్లలో 41 పరుగులకే ఆలౌట్ అయింది. ధర్మవరం మహిళల జట్టు 246 పరుగుల భారీ తేడాతో గెలిచింది. ఈ జట్టులోని చందన, బృంద తలా మూడు వికెట్లు పడగొట్టారు. కోచ్ రాజశేఖర్ మ్యాచ్‌ను పర్యవేక్షించారు.

ఏపీఎం తీరుపై విచారణ

గాండ్లపెంట, న్యూస్‌టుడే : ఈ నెల 5న ప్రగతి మండల సమాఖ్య నూతన పాలకవర్గం ఎన్నికలో ఏపీఎం సూర్యనారాయణ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని, మహిళా సమాఖ్య సభ్యులను బయటకు పోవాలని అసభ్యకరంగా మాట్లాడినట్లు సభ్యులు హసీణ, రమణమ్మ, శైలజ, రమాదేవిలు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం డీపీఎం ఓబులేశు విచారణ చేశారు. ఏపీఎం సూర్యనారాయణ, మహిళా సభ్యులతో వేర్వేరుగా విచారణ చేశారు. నివేదికను పీడీకి పంపనున్నట్లు విచారణ అధికారి తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యంతో రోగికి ఇన్‌ఫెక్షన్


నరసింహులు

బత్తలపల్లి, న్యూస్‌టుడే : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం ఫలితంగా బత్తలపల్లికి చెందిన బేల్దారి నరసింహులుకు ఇన్‌ఫెక్షన్ ఏర్పడి గడ్డలు వచ్చాయని వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. నెల కిందట ఆరోగ్యం బాగాలేక ఆయన ఆ ఆరోగ్య కేంద్రానికి వెళ్లారు. అప్పుడు రోగులకు వైద్యం చేయకుండా డ్యూటీలో ఉన్న డాక్టర్ గంగిరెడ్డి 104 వాహనంలో వెళ్లిపోయారు. దీంతో ఏఎన్ఎం నరసింహులుకు ఇంజెక్షన్ వేశారు. నొప్పి రావడం.. గడ్డలు ఏర్పడటంతో ఆయన తిరిగి ఆ కేంద్రం వైద్యులను సంప్రదించారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే తనకు ఇన్‌ఫెక్షన్ అయిందని నరసింహులు వాపోతూ.. వీడియో సామాజిక మాధ్యమంలో పోస్టు చేశారు. దీనిపై డాక్టర్ గంగిరెడ్డిని వివరణ కోరగా ఇన్‌ఫెక్షన్ కావడంతో నరసింహులుకు వైద్యం చేసి మాత్రలు ఇచ్చామన్నారు. అవసరమైతే అనంతపురం సర్వజన ఆసుపత్రికి రాసి పంపుతామని బాధితుడికి తెలిపామన్నారు.

దారి అధ్వానం.. నరక ప్రయాణం

ముదిగుబ్బ మండలంలోని రాళ్లఅనంతపురం క్రాస్ నుంచి కొడవండ్లపల్లికి వెళ్లే రహదారి దారుణంగా మారింది. హస్తినాపురం, బ్రహ్మదేవరపల్లి, గంగిరెడ్డిపల్లి సమీపంలో రోడ్డు అంచులు విరిగి, గోతులు ఏర్పడి ప్రమాదకరంగా ఉండటంతో వాహనదారులు ప్రయాణించేందుకు అవస్థలు పడుతున్నారు. గతంలో ఇసుక టిప్పర్లు తిరగడం, ప్రస్తుతం కంకర టిప్పర్లు ఈ మార్గంలో వెళ్లడంతో పూర్తి ధ్వంసమైన రహదారి మరింత అధ్వానంగా తయారైంది. దీంతో ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. సమస్యపై ఇన్‌ఛార్జి ఆర్అండ్‌బీ ఏఈ వెన్నరుస్వామిని వివరణ కోరగా త్వరలోనే రోడ్లకు మరమ్మతు పనులు చేపడతామన్నారు. **- న్యూస్‌టుడే, ముదిగుబ్బ**



బడి ప్రాంగణం.. విష కీటకాలకు ఆవాసం



కదిరి బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణం పిచ్చి మొక్కలు పెరిగి విషసర్పాలకు కేంద్రంగా మారిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తరగతి గదులు, క్రీడా మైదానానికి ఆనుకొని గడ్డి, పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగాయి. ప్రస్తుతం వర్షాకాలం కావటంతో విష కీటకాల సంచారం పెరిగే అవకాశం ఉంది. మైదానంలో చెట్ల పొదలు పెరగడంతో ఆడుకునేందుకు వెళ్లే పిల్లలకు ప్రమాదం పొంచి ఉంది. ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటాచలం దృష్టికి తీసుకెళ్లగా.. ఒకటి, రెండు రోజుల్లో పొక్లెయిన్ ఏర్పాటు చేసి చెట్ల పొదలను తొలగిస్తామన్నారు. పిల్లలకు ఆటంకం, ప్రమాదం లేకుండా చూస్తామని చెప్పారు. **- న్యూస్‌టుడే, కదిరి**

గుంతను గుర్తించేందుకు బారికేడు

ధర్మవరంలోని గాంధీనగర్ ప్రధాన రహదారిపై గుంత పడింది. వేగనిరోధకాలు ఉన్న ప్రాంతంలో వర్షాల కారణంగా రోడ్డు ఛిద్రమై గుంత ఏర్పడింది. ద్విచక్ర వాహనదారులు ఇక్కడ ప్రమాదం బారిన పడుతుండటంతో స్థానికులు గుంత ఉన్న ప్రాంతంలో బారికేడ్‌ను ఉంచారు. దీంతో గుంతను గుర్తించి వాహనదారులు జాగ్రత్తగా వెళ్తున్నారు. నిత్యం వాహనాల రద్దీ ఉండే ప్రాంతం కావడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. సమస్యను ఆర్అండ్‌బీ డీఈ నాగప్పలరావు దృష్టికి తీసుకెళ్లగా రహదారి గుంతల మరమ్మతులకు టెండర్లు పిలిచామని త్వరలో మరమ్మతు పనులు చేపడతామని పేర్కొన్నారు. **- న్యూస్‌టుడే, ధర్మవరం**



ఇలా మడుగు.. వేసేదెలా అడుగు



కొత్తచెరువు మండలంలోని నాగిరెడ్డిపల్లి కాలనీలో నడిరోడ్డుపై నిలిచిన మడుగుతో రాకపోకలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. నాలుగు పంచాయతీల్లోని పది గ్రామాల రాకపోకలకు ఇదే ప్రధాన రహదారి. చిన్నపాటి వర్షం కురిసినా నడిరోడ్డుపై మడుగు ఏర్పడి వాహనాలు ముందుకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోంది. నివాసాల మధ్యలో వర్షంనీరు రోజుల తరబడి నిలిచి మురుగుగా మారి అపరిశుభ్రత నెలకొంటోంది. సమస్యను కార్యదర్శి నరేశ్ దృష్టికి తీసుకెళ్లగా పంచాయతీ ఖాతాలో నిధుల్లేవు. మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతానన్నారు. **- న్యూస్‌టుడే, కొత్తచెరువు**

ఆదమరిస్తే అంతే సంగతులు..

ధర్మవరంలోని కొత్తపేటలోకి వెళ్లే ప్రధాన రహదారికి సమీపంలోని కల్వర్టుపై రంధ్రం ఏర్పడటంతో రాకపోకలకు పాదచారులు, వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. రోడ్డు మధ్యలో రధ్రం ఉండటతో రాకపోకలు సాగించే సమయంలో అందులో పడతామోనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళ దాన్ని అంచనా వేయలేక పలువురు పాదచారులు అందులోపడి గాయాలపాలైన సందర్భాలున్నాయి. కల్వర్టుకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. సమస్యను మున్సిపల్ శానిటేషన్ అధికారి కేశవ దృష్టికి తీసుకెళ్లగా కల్వర్టును పరిశీలించి ఏర్పడిన రంధ్రాన్ని మూసివేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. **– న్యూస్‌టుడే, ధర్మవరం పట్టణం**



ఎస్ఐలు బాధ్యతల స్వీకరణ

ధర్మవరం, న్యూస్‌టుడే : ధర్మవరం గ్రామీణ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా పి.శ్రీనివాసులు శనివారం బాధ్యతలు చేపట్టారు. బత్తలపల్లి ఎస్ఐగా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫిర్యాదులపై తక్షణం స్పందిస్తానన్నారు. ఎస్ఐ పోలీసుస్టేషన్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

తలుపుల: తలుపుల నూతన ఎస్ఐగా నరసింహుడు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పట్నం పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై తలుపులకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న దిలీప్‌కుమార్ వీఆర్‌కు వెళ్లారు. పోలీస్ సిబ్బంది ఆయనకు అభినందలు తెలిపారు.

డీలర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

కొత్తచెరువు, న్యూస్‌టుడే : కొత్తచెరువు మండలంలో ప్రభుత్వ చౌకధరల దుకాణాల డీలర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని 38 దుకాణాల డీలర్లు శనివారం సమావేశమయ్యారు. అధ్యక్షుడిగా గుంటిపల్లి వెంకటేశు, కార్యదర్శిగా కేశప్పను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారిని డీలర్లు సన్మానించారు. కార్యక్రమంలో మండల తెదేపా కన్వీనర్లు రామకృష్ణ, పట్టణ కన్వీనర్ శీన, నాయకులు శ్రీనివాసులు, బాబా, వెంకటరెడ్డి, లింగప్ప పాల్గొన్నారు.

అభివృద్ధి పనులతో పల్లెలకు పండగొచ్చింది : మంత్రి


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సత్యకుమార్, శ్రీరామ్

బత్తలపల్లి, న్యూస్‌టుడే : గత ఐదేళ్లుగా రాష్ట్రంలో అభివృద్ధికి పట్టిన గ్రహణం వీడిందని, ఇప్పుడిప్పుడే పల్లెల్లో అభివృద్ధికి అడుగులు పడుతున్నాయని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. శనివారం బత్తలపల్లి మండలం మాల్యవంతంలో పల్లె పండగ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. బీసీ, ఎస్సీ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎక్కడ చూసినా గుంతలు పడిన రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల్లోనే రోడ్లకు మోక్షం వచ్చింది. గ్రామాలకు నిజమైన పండగ ఇప్పుడే వచ్చిందన్నారు. కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీఓ మహేశ్, ఎంపీడీఓ నరసింహనాయుడు, తహసీల్దారు స్వర్ణలత, జడ్పీటీసీ సభ్యురాలు కోటి సుధా, సర్పంచి దేవి, మండల కన్వీనర్ నారాయణరెడ్డి, నాయకులు చల్లా శ్రీనివాసులు, సురేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా కృషి

ధర్మవరం: ప్రధాని మోదీ దేశ, సీఎం చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కష్టపడుతున్నారని వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం ధర్మవరంలోని ఎన్డీఏ కార్యాలయంలో భాజపా ఎస్సీ మోర్చా శ్రీసత్యసాయి జిల్లా సభ్యత్వ నమోదు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్సీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లాల్‌సింగ్ ఆర్య, రాష్ట్ర అధ్యక్షుడు దేవానంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భాజపా 18 కోట్ల సభ్యత్వంతో దేశంలోనే అతి పెద్ద పార్టీగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే పథకాలు ప్రజలకు చేరేలా చేస్తున్నామన్నారు. ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయన్నారు. సభ్యత్వ నమోదుపై నాయకులతో మంత్రి సమీక్షించారు. శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల భాజపా అధ్యక్షులు జి.ఎం.శేఖర్, సందిరెడ్డి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు సాకే ఓబులేశు, జింకా చంద్రశేఖర్, నియోజకవర్గ కన్వీనర్ గోపాల్‌రెడ్డి, నాయకులు గిర్రాజు నగేశ్, డోలా రాజారెడ్డి, చంద్ర, భక్తవత్సలం, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి సత్యకుమార్ యాదవ్ పర్యటన

ధర్మవరం : మంత్రి సత్యకుమార్ ఆదివారం ధర్మవరం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు ముదిగుబ్బలో పల్లె పండగ పంచాయతీ వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొననున్నారు. ముదిగుబ్బలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. భాజపా కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు తాడిమర్రి మండలం ఏకపాదంపల్లిలో పండ్ల మొక్కల పెంపకం కార్యక్రమంలో పాల్గొంటారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు ధర్మవరం మండలం గొట్లూరులో నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు అర్హత పరీక్ష నేడు

ధర్మవరం పట్టణం: మంత్రి సత్యకుమార్ సహకారంతో దిల్లీకి చెందిన సివిల్స్ కోచింగ్ సంస్థ డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో డిగ్రీ పూర్తి చేసిన మహిళలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు సంస్కృతి స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. డిగ్రీ పూర్తి చేసుకున్న యువతులకు సివిల్స్ శిక్షణకు అవకాశం కల్పించాలనే లక్ష్యంతో ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన యువతులకు దిల్లీలో రెండేళ్లపాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

రోడ్డుకు మరమ్మతులు చేయాలని వినతి

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే : మండలంలోని బడన్నపల్లికి వెళ్లే రహదారికి గుంతలుపడి అధ్వానంగా తయారైందని, వెంటనే మరమ్మతులు చేయించాలని సీపీఎం నాయకులు డిమాండు చేశారు. శనివారం గ్రామ రహదారి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీఓ సాయి మనోహర్‌కు బడన్నపల్లి గ్రామస్థులు, సీపీఎం నాయకులు వినతి పత్రం అందజేశారు.

ఉర్దూ భాషా, సాహిత్య సేవకులకు పురస్కారాలు

ఈ నెల 25 వరకు దరఖాస్తుకు గడువు

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే : ఉర్దూ భాషా, సాహిత్యానికి విభిన్న విభాగాల్లో అత్యుత్తమ సేవలందించిన వారికి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జాతీయ స్థాయి పురస్కారం, డా.అబ్దుల్ హఖ్ ప్రాంతీయ స్థాయి పురస్కారం అందజేయనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ రామసుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మైనారిటీ వెల్ఫేర్ దినోత్సవం, జాతీయ విద్యాదినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబరు 11న ఉర్దూ భాషా, సాహిత్య విభిన్న విభాగాలలో సేవలందించిన వారికి మౌలానా అబ్దుల్ ఆజాద్ పురస్కారం, రూ.1,25,000 ప్రోత్సాహకం, ధ్రువపత్రం, జ్ఞాపిక, డా.అబ్దుల్ హఖ్ ప్రాంతీయ స్థాయి పురస్కారం కింద రూ.1,00,000 ప్రోత్సాహకం, ధ్రువపత్రం, జ్ఞాపిక అందించనున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్రానికి చెందిన ఉర్దూ సాహితీవేత్తలకు, పండితులకు, కవులు, పాత్రికేయులకు, విమర్శ, పరిశోధన, గద్యబోధన ఇలా వివిధ విభాగాల్లో ఉర్దూ బాషాభివృద్ధికి సేవలందించిన ఆరుగురికి జీవితకాల సాఫల్య పురస్కారం అందిస్తారన్నారు. ఉర్దూ భాషా కోసం కృషి చేసిన ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, ఉర్దూ భాషాలో ఉన్నత శ్రేణిలో రాణించిన విద్యార్థులకు ఉత్తమ విద్యార్థి పురస్కారం అందించనున్నట్లు వివరించారు. ఉర్దూ అకాడమీ జారీ చేసిన దరఖాస్తులను పూరించి ఈ నెల 25వ తేదీలోపు డా.మహమ్మద్ మస్తాన్, డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ, డోర్ నం: 76-1-6ఎ/182, మాలవికా విల్లా, హెచ్.బి. కాలనీ, భవానీపురం, విజయవాడ-520012 చిరునామాకు పోస్టు, లేదా కొరియర్ ద్వారా పంపాలని కోరారు.

పోలీసుస్టేషన్‌కు ప్రేమ వ్యవహారం

నల్లచెరువు (కదిరి): ప్రేమించుకున్న జంట పెళ్లి వ్యవహారం చెడటంతో పోలీసు స్టేషన్‌ను చేరిన ఘటన నల్లచెరువు మండలంలో చోటుచేసుకుంది. మండలానికి చెందిన యువతీ, యువకుడు ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు. ఇద్దరూ కర్ణాటకలోని ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగం చేస్తున్నారు. వారు చాలా కాలంగా ప్రేమించుకుంటున్నారు. మూడు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చారు. అయితే యువకుడి కుటుంబం నుంచి అభ్యంతరాలు వ్యక్తమైనట్లు సమాచారం. ప్రేమించిన అమ్మాయిని కాదని మరొకరితో పెళ్లికి సంబంధం మాట్లాడినట్లు తెలిసింది. దీంతో తనకు జరిగిన అన్యాయంపై యువతి పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. ఈ విషయంపై ఎస్ఐ మగ్బూల్‌బాషాను సంప్రదించగా విచారిస్తున్నామన్నారు.

ఎస్సైపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: సీకేపల్లి ఎస్సై సత్యనారాయణపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు మేడాపురం గ్రామానికి చెందిన పసల వంశీకిరణ్ పేర్కొన్నాడు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మేడాపురంలో గత నెల 27న తన బంధువైన ఆదిశేషుపై స్థానికులు విక్రమ్ అతని కుటుంబ సభ్యులు, మరో ఇద్దరు దాడి చేశారన్నారు. ఆదిశేషు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు పురోగతిని తెలుసుకునేందుకు బాధితుడితో కలిసి శనివారం ఠాణాకు వెళ్లగా ఆదిశేషుతోపాటు తనను కూడా ఎస్సై దుర్భాషలాడుతూ, దురుసుగా వ్యవహరించారని అందులో పేర్కొన్నారు. దీనిపై జాతీయ మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు వివరించాడు. ఎస్సై సత్యనారాయణ దృష్టికి తీసుకుపోగా తాను ఎవరినీ దూషించలేదన్నారు.

ప్రశాంత జీవనం సాగించండి

గాండ్లపెంట, న్యూస్‌టుడే : గ్రామాల్లో గొడవలకు దూరంగా ఉండి ప్రశాంత వాతావరణంలో జీవనం కొనసాగించాలని సీఐ నాగేంద్ర, ఎస్ఐ కృష్ణవేణి సూచించారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణంలో మండలంలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. గ్రామాల్లో గొడవలు సృష్టించడం, చట్టవ్యతిరేక పనులు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ స్నేహపూర్వక వ్యవహరించి నేరాలు లేని మండలంగా గుర్తింపు రావాలని పోలీస్ సిబ్బందికి సహకరించాలని సూచించారు.

వేరుసెనగ రైతులను ముంచిన వాన


తడిచి రంగుమారిన కాయలను చూపుతున్న రైతు

తలుపుల, న్యూస్‌టుడే : వ్యవసాయ బావుల కింద సాగైన వేరుసెనగ పంటను తుపాను నిలువునా ముంచింది. దాని తాకిడికి వేరుసెనగ కాయలు నల్లగా మారాయి. పశుగ్రాసమైతే పనికి రాకుండా కుళ్లిపోయిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తలుపుల మండలంలో తుపాను ప్రభావంతో ఐదు నాలుగు రోజులుగా కురిసిన వర్షానికి వ్యవసాయ బావులు, బోర్లకింద సాగుచేసిన ఖరీఫ్ వేరుసెనగ పంట పండినా ప్రయోజనం లేకుండాపోయిందని రైతులు వాపోతున్నారు. కోసిన కాయలు ఆరక నల్లగా మారిపోతే, పీకని చెట్లకు మొలకలు వచ్చి భూమిలోనే పోతున్నాయి. మండలంలో పులిగుండ్లపల్లి, వేపమానిపేట, పెద్దన్నవారిపల్లి, నూతనకాలువ, ఓబులరెడ్డిపల్లి, తదితర పంచాయతీల్లో వేరుసెనగ పంట అక్కడక్కడా దెబ్బతింది. తుపాను తాకిడితో పంట సాగుకు పెట్టిన పెట్టుబడి ఖర్చులు కూడా చేతికి వచ్చేలా లేవని పలువురు రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

పంట పండినా పనికి రాకుండాపోయింది.

నాకున్న 4.5 ఎకరాల్లో రూ.1.60 లక్షలు పెట్టుబడి పెట్టి వేరుసెనగ పంట సాగుచేశా. పంట బాగా పండింది. మంచి దిగుబడి వచ్చిందని సంబరపడ్డా. ఇంతలో వాయుగుండం వచ్చి నిలువునా ముంచింది. పీకి ఆరపెట్టిన కాయలు నల్లగా మారాయి. గ్రాసం కుళ్లిపోయింది. పీకని చెట్లతో మొలకలు వచ్చి భూమిలోనే కాయలు పోతున్నాయి. పంటసాగుకు పెట్టిన పెట్టుబడి ఖర్చులు చేతికి వచ్చేలా లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

- విష్ణువర్ధన్, రైతు, తొగటవాండ్లపల్లి

ప్రభుత్వానికి నివేదిస్తాం

మండలంలో ఇప్పటికి వరకు 15 మంది రైతులు నుంచి ఫిర్యాదు అందాయి. వారికి సంబంధించి 10 హెక్టార్లలో పంట దెబ్బతిన్నట్లు గుర్తించాం. మిగిలిన రైతులు ఫిర్యాదు చేస్తే పరిశీలించి ప్రభుత్వానికి నివేదిస్తాం.

- షాదాబ్, ఏఓ, తలుపుల

పంటల పరిశీలన


వేరుసెనగ వాములను పరిశీలిస్తున్న ఏఓ వెంకటరమణాచారి, రైతులు

అమడగూరు: మండలంలోని కొలిమిరాళ్లపల్లి, మహమ్మదాబాద్, గొల్లపల్లి, పత్రావాండ్లపల్లి తదితర గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటలను శనివారం ఏఓ వెంకటరమణాచారి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సజ్జ, వేరుసెనగ పంటలు దెబ్బతిన్న రైతుల వివరాలను జిల్లా అధికారులకు పంపుతున్నట్లు తెలిపారు. వీహెచ్ఏ రమణప్ప, వాణిశ్రీ రైతులు పాల్గొన్నారు.

పెట్టుబడి దక్కడం కష్టం

కొత్తచెరువు: చేతికొచ్చిన పంట తుపాను కారణంగా కుళ్లిపోయి తీరని నష్టం వాటిల్లిందని కొడపగానిపల్లికి చెందిన రైతులు గుత్తి శ్రీరాములు, నాగభూషణ, వరలక్ష్మిలు వాపోయారు. 'నాలుగున్నర ఎకరాల్లో 1218 రకం వేరుసెనగ చేశాం. కనీసం 120 బస్తాల దిగుబడి వస్తుందని ఆశించాం. వేరుసెనగ పీకిన మరుసటి రోజు నుంచి తుపాను పట్టుకుంది. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి పశుగ్రాసం పూర్తిగా కుళ్లిపోగా కాయలు మొలకలు వచ్చాయి. రూ.2లక్షల నష్టం జరిగింది. కనీసం పెట్టుబడి తిరిగి చేతికందే పరిస్థితి లేక పోగా పశుగ్రాసం కూడా దక్కలేదు' అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారులు జరిగిన నష్టాన్ని పరిశీలించి ప్రభుత్వ సాయం అందించాలని రైతులు విజ్ఞప్తి చేశారు.


కుళ్లిన వేరుసెనగను చూపుతున్న రైతులు